శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౭. | చెన్నపురి: విళంబి సంవత్సర ఆశ్వయుజ, కార్తిక మాసములు. | సంచిక 4,

A PRAYER ADAPTED FROM "THE UNIVERSAL PRAYER" OF ALEXANDER POPE.

చ. తను నిరవద్యశుద్ధపరతత్త్వముగా నెఱుఁగంగలేనియీ
మనుజులవేషభాషలక్రమంబున నందఱ కన్నిరూపులై
చనుచు ననేకనామముల సర్వజనార్చ్యుల నందుచుండునీ
యనుపమదివ్యతేజము నహర్నిశము న్మదిలోఁ దలంచెదన్. 1.

క. ఏయేవ్యాపారములు వి। ధేయము లని యంతరాత్మ దెల్పెడునో నా
కాయావ్యాపారంబులఁ। జేయఁగ నాసక్తి గలుగఁజేయవె దేవా. 2.

క. ఏయేకార్యంబుల న। న్యాయము లని తెల్పు నామనస్సాక్షి కరం
బాయాకార్యంబులఁ గడు। హేయం బని త్రోచిపుచ్చ నిచ్ఛ నొసఁగవే. 3.

క. నయవర్త్తఁ జరించెద నే। నియుఁ దత్సన్మార్గమున నె నిశ్చలముగ ను
న్ని యనుగ్రహించి నా క। క్షయపదవిం బ్రీతిమెయిఁ బ్రసాదింపఁగదే. 4.

క. నయపథము దప్పిచని దు। ర్ణయపరతఁ జరింతు నేని నా కది తొలఁగన్
దయసేసి నన్నుఁ బ్రీతి ని। రయముం బొరయంగనీక రక్షింపఁగదే. 5.

తే. గీ. సంపదలుగల్గుతఱి నతిశయముదములఁ। గష్టములుగల్గునెడ నసంతుష్టి ఖేద
ములను మామకహృదయంబు గలఁతనొంద। నీక ప్రోవఁగదే జగదేకవంద్య. 6.

క. పరులకుఁ గష్టము లొదవిన। దురటిల్లుచు నుండి సుఖము దోడ్పడు వెనుకం
బరమామోదము నొందెడు। పరహితమతి యొసఁగి నన్నుఁ బాలింపఁగదే.

క. ఒరు లేయవిచేసిన వగఁ। బొరసెదు నామనము వాని బుద్ధిఁ దెలిసి నే
నొరులకుఁ జేయకయుండం। బరేంగితవివేక మొసఁగి పాలింపు

తే. గీ. పాట్లకై యనుదినమును బట్టెడన్న। మాత్మకును శాంతి నొసఁగఁగ నాసపడుఁ
గాంతి కోర్కులఁ గల్గెడులాభనష్ట। ములను నీవయెఱుంగుదు ; తలఁప నేను. 9.

A HYMN.

చ. సకలచరాచరాత్మకవిశాలజగద్రచనాద్భుతక్రియా
ప్రకటితశిల్పచాతురికిఁ బాత్ర మగారము విశ్వమే నిర
ర్థకములు సర్వకర్తకు ధర న్నరకల్పితదేవమందిర
ప్రకరము లన్నబుద్ధి మదిఁ బాదుకొనం దయసేయు మీశ్వరా!

ఉ. నీలనభంబుడుప్రకరనిర్మలదీపసహస్రశోభితం
బాలయ మెన్న నీకు మఘవాశ్మవినిర్మిత మింద్రనీలశో
భాలలితామలాంబుధరపంక్తి తిరస్కరిణీచయంబు శం
పాలతికాళి తోరణపుఁబాళి మహీస్థలి పాదపీఠమున్. 2.

చ. అనుదినము న్వసుంధర సమగ్రగతి న్ఫలపుష్పసంతతు
ల్దనరఁగ నిచ్చు నిచ్చలును దావకపావనపాదపంకజా
ర్చన మొనరించు కాలములు చాటెడు నీమహిమాదు లెల్ల నీ
యనుచరవర్గ మీపృథివియాదిగఁ గల్గినపంచభూతముల్. 3.

ఉ. ఏ నెటుగాంతు నేపగిది నేర్పడఁగ న్వినుతింతు నిన్నవా
జ్మానసగోచరుం బరము మానిదురాసదు నిత్యు నవ్యయున్
ఈనిఖిలప్రపంచమున నెయ్యెడఁ జూచిన నీవిలాసము
ల్గానఁగ నౌనెకాని మఱి కానఁగ నేరను నిన్ను నెమ్మెయిన్. 4.

చ. వితతనభోంతరాళములు వేయియుగంబులు సొచ్చి చూడ నీ
యతులితనైజరూపలవమైన గ్రహింపఁగ నేర్చునెట్లు శా
శ్వతుఁడ వనాదిమధ్యుఁడవు శక్యమె నిన్గుణకాలభాగని
శ్చితుఁగ నెఱుంగ నెవ్విధము శేముషిఁ గల్గినయట్టివానికిన్.

ఉ. కావున దేవ నిన్నెఱుఁగఁగల్గుటకుం దగుసాధనంబులన్
నీవ యొసంగఁగావలయు నెమ్మి ననుగ్రహముంచి నాపయిం
గేవలమూఢుఁడ న్జడుఁడఁ గిల్బిషమగ్నుఁడ నిన్ను వేఁడెదం
బ్రోవుము కావు మోవరద ప్రోవు మనాథు నను న్దయానిధీ. 6

వాయుస్థితి ననేకవిధముల ననుభవ యోగ్యముగనున్నది. ఒకానొకప్పుడు కొన్ని కొన్ని దేశములును పట్టణములును సమమైన యక్షరేఖ (On the same latitude) యందే యుండవచ్చును. కాని వానిశీతోష్ణస్థితి సమముగ నెన్నటికి నుండఁజాలదు. ఇందులకు నిదర్శనము. ఇంగ్లాండు ఐర్లాండు దేశములును న్యూంఫౌండులాండు దేశమును సమానాక్షరేఖయందే యున్నయవి. కాని ఇంగ్లాండు ఐర్లాండు దేశములు సమ శీతోష్ణములుగను (Temperate climate), న్యూఫౌండులాండు దేశ మధిక శీతలముగనుఉండును. చుట్టును సముద్రముండుటచేతను, ఉష్ణజలప్రవాహమైన గల్ఫుస్ట్రీ (Gulf stream) మనునది ఇంగ్లాండు ఐర్లాండు దేశములకు వేడినిగొనివచ్చుట చేతను ఇట్టి భేదములు గలుగుటకు కారణమవుచున్నది.

వాయు చలనములఁ బట్టియు స్థల స్వభావమునుబట్టియు, దేశముయొక్క మిట్ట పల్లములను బట్టియుఁగూడ శీతోష్ణాది వాయుస్థితి మారుచుండును. అరణ్యప్రదేశమున నెప్పుడు నధికవర్షము గురియుచుండును. వృక్షజాతులన్నియు నావిరినిగలుగఁజేయుచు వాయువు నట్టియావిరితో నింపివేయును. అందువలన వర్ష మధికముగఁ గురియుటకు కారణమవును. కనుక అరణ్యప్రదేశములు ప్రజలకు మహోపకారులని యెరుగవలయును. ప్రస్తుతమందు వ్యవసాయవృద్ధి ఎక్కువగ నుండుటచేత ప్రపంచమందుండు నరణ్యములు క్రమక్రమముగ నాశముచేయఁబడుచున్నవి. అందుచే భూమి సూర్యకిరణములచే కాలి వాయువునం దుష్ణము ప్రవేశింపఁజేయుచున్నది (By radiation). ఇంతియగాక వాయువునకు పైని మేఘములుండుటచే వాయువునందున్న యుష్ణమెక్కడికిని పోఁజాలక క్రమక్రమమున నధికమగుచుండును.

ఎత్తైన ప్రదేశములందు ప్రచండవాయు ప్రసారమును అధికవర్ష పతనమును లేకుండును. రేగటిభూమిగా నున్నయెడల నాభూభాగము నీటియావిరిని అధికముగఁ బీల్చుచుండును. ఇందుచే చుట్టుపట్లనున్న వాయువు చల్లనిభూమిపై నుండియుండును. కనుక నదియుష్ణమును పొందక చల్లదనమును గలిగియుండును. కంకరభూమిగానున్న ప్రదేశములు ఉన్న నీటియావిరినిగూడ పోఁగొట్టుకొనుచుండును. అందుచే చుట్టును ఉన్న వాయువు వెచ్చగాను అనుభవయోగ్యముగాను ఉండును.

ఆఫ్రికాఖండమున కుత్తరమున మిక్కిలి ఉష్ణముగానుండును. గ్రీనులెండు (Green land) నకు పశ్చిమోత్తరభాగమున మిక్కిలి శీతలములుగానుండును. ఇవియే శీతోష్ణములకు సరిహద్దులని చెప్పవచ్చును. అన్నివిధముల నాలోచించి చూడఁగా ఐరోపాఖండము శీతోష్ణస్థితులనుబట్టి మిక్కిలి వాసయోగ్యమని చెప్పుటకు వెనుక తీయఁబనిలేదు.

వాయువునం దధికముగ ఆవిరి యున్నపుడు సూర్యాస్తమయ సమయముల నాకాశము రంగురంగులుగ నుండును. ఆకాశ మెఱ్ఱగానున్నపుడు దినమంతయు సుఖముగా నుండును. పసపు పచ్చగానున్నయాకాశము ఆకుపచ్చగా మారినయెడ అధికమైనగాలిగాని వర్షముగాని కలుగును. వాయువునందావిరితక్కువగనుండినచో ఎఱుపు రంగును, ఆవిరియెక్కువగా నుండినపుడు పచ్చరంగును, ఆకాశమున వెలువడుచుండును.

మేఘములు పలుచగాను మెత్తగాను ఉండినటుల కనిపించినపుడు శీతోష్ణాది వాయుస్థితి బహు మనోరంజకముగ నుండును. వంకరగల యంచులుగలవై మేఘములు కడుదట్టములుగ నుండినచో ఉఱుము మెఱుములతోఁ గూడినవర్షము గలుగునని చెప్పుచున్నారు. కొన్నికొన్ని పక్షులయొక్కయు జంతువులయొక్కయు గమనికలనుబట్టికూడ శీతోష్ణాది వాయుస్థితిని కొంతవరకుఁ గన్పెట్టవచ్చును. పందిపిల్లలు గడ్డిపరకలను నోట కరచి పట్టుకొని పరుగెత్తుచున్నపుడును, వానకోయిలలు (Swallows) తలవంచికొని యుండినపుడును వాయువుతోఁ గూడినవర్షముకురియును. ఆకాశమున నక్షత్రములు మిణుకు మిణుకు మనుచుండునపుడాకాశమునందావిరి యుండినటులగ్రహింపవచ్చును. దక్షిణపూర్వముగావాయువువీచుచుండి ఆకాశము నిర్మలముగానుండినపుడు మనచుట్టు నుండు ఉష్ణమధికమగుచుండును. ఇట్లుగాక మేఘములు దిఙ్మండలము (Horizon) న కంటియుండినచో తేమగానుండును. ఉత్తరపూర్వమున దట్టముగ మేఘములావరించి యుండినచో తుపానుగాలి సంభవించును. దూరముగానుండువస్తువులు దగ్గరగా కనిపించినచో వర్షము పుష్కలముగ కురియుననుట కొంతమాత్రమును సందియములేదు.

పైని వ్రాయఁబడినవిగాక యింక ననేకమైనచిహ్నలవలనఁగూడ వర్షముకురియు సమయమును తెలిసికొనవచ్చును. వర్షము రాఁబోవుసమయమున-పుష్పములు రెక్కలను మూసికొనును. గొఱ్ఱెలుమొదలగునవి ముడుచుకొని మూలలఁజేరును. సముద్రపుపక్షులు ఒడ్డునఁజేరును. భూమిమీదనుండు పక్షులు కలకలలాడుచుండును. పిల్లి తనతలక్రిందికి వంచియుండును. సాలెపురుగులుమాయమవును. చిన్నచిన్న పురుగులు కలుగులలోనుండి పైకవచ్చి వర్షపునీటికొరకు వేచియుండును. జెలగలు నీటిలోనికి మునిగిపోవును.

పర్వతములు మేఘావృతమైనపుడును, మిక్కిలి యెఱ్ఱగా నుండినట్టిగాని ఆకుపచ్చగా నుండినట్టిగాని ఇంద్రధన (Rain-bow) స్సాకాశమున కనుపడినపుడును, చంద్రబింబము వెలవెలలాడుచుండి చుట్టునుగుడికట్టినపుడును దూరవర్షము కురియునని యూహింపవచ్చును.

సీ. నవరత్నమయభూషణములు దాల్చినవారు సింహాసనస్థులై చెలఁగువారు
పరతత్త్వవాసనాపరత గాంచినవారు నిఖిలవిద్యాప్రౌఢి నెఱయువారు
చిరకాలజీవులై క్షేమమొందెడువారు వితరణవిఖ్యాతి వెలయువారు
బంధుమిత్రస్ఫూర్తిఁ బాయకుండెడువారు బహుపుత్రలాభంబుఁ బడయువారు
చక్కఁదనమున వన్నెకు నెక్కువారు ; తొంటిమేనుల సద్భక్తితొంగలింపఁ
కాశికానాథుఁ గామారిఁ గాలకంఠు । పూజచేసినవారెపో పువ్వుఁబోఁడి. ౧౬.

సీ. కడలేని సంసారజడధిలో మునిఁగిన జనులపాలిటి నావ శంభుసేవ
కడుదూరమైయున్న కైవల్యసీమకుఁ జక్కని పెనుత్రోవ శంభుసేవ
యతిభోగభాగ్యంబు లనుముత్తియంబులసరులఁ గూర్చినకోవ శంభుసేవ
సకలాగమజ్ఞానసారమహీజాతజాతంబులో చేవ శంభుసేవ
నిరవధిక్రూరపాతకదురవగాహ । గహనదహనసమున్నిద్రగంధవాహ
సఖశిఖామాలికలతేవ శంభుసేవ । (సద్గుణలతాంతములతీవ శంభుసేవ). ౧౭.

క. కావున మన మద్దేవుని । భావంబుననిలిపి సుతునిఁ బడయుదమనుచున్
దేవియును దానుభూపతి । కేవలతరశైవమార్గ కృతనిశ్చయుఁడై. ౧౮.

క. హాటకశైలధనుర్ధరుఁ । బాటింపనివాఁడు నాకుఁ బగవాఁడనుచున్
గూటపరిపంధిగర్వో । చ్చాటన గుణశాలి యతఁడు చాటంబంచెన్. ౧౯.

ఉ. ఎచ్చటఁ జూచినం బ్రమథహిండితచండనిశాతవర్తనం
బెచ్చటఁ జూచినన్ గుహగణేశ్వరభవ్యగుణానువాదనం
బెచ్చటఁ జూచినన్ శివసమీహితపుణ్యకథానుకీర్తనం
బచ్చుపడంగఁ జేసె నతఁ డాదిమశైవకులాగ్రగణ్యుఁడై. ౨౦.

శా. చూడం జిత్రము పత్రపుష్పములకంచుం జేరనేతెంచి పెన్
ప్రోడల్ శైవకథారహస్యములకై పోరాడుచుం బోవుచోఁ
గూడ న్వచ్చి తదీయవాదములచిక్కుల్ దీర్చుఁ బో పట్టణ
క్రీడాకాననవీథికాగ్రశుకశారీకిన్నరద్వంద్వముల్. ౨౧.

శా. కించిన్మర్దళనృత్యగీతసరసక్రీడావిధంబుల్ శుకీ
చంచూచంచదనూనరత్నఖచితస్తంభంబు లభ్రంకషో
దంచద్గోపుర పంక్తులు న్నెఱయ నుద్యద్భక్తి నూరూరఁ గ
ట్టించెన్ భూపతి దేవతానిలయకోటిన్ జాహ్నవీజూటికిన్. ౨౨.

సీ. చంద్రకాంతోపలస్వచ్ఛవేదిస్థలుల్ కట్టిజవ్వాదిచేఁ గలయనలికి
యనవుగాఁ గ్రొత్తకట్టాణిముత్తియముల నిగ్గులు వెదచల్ల ముగ్గువెట్టి

యర్ఘ్యోదకంబుల నభిషేక మొనరించి రమణీయరత్న పీఠమున నునిచి
మృగమదపంకంబు మేన నిండ నలంది మేలేర్చి క్రొవ్విరుల్ గీలుకొలిపి
ధూపమర్పించి కర్పూరదీప మొసఁగి । యమృతదివ్యాన్నరుచి రోపహారమిచ్చి
వనితయును దాను సాష్టాంగవినతిఁ జేసి । చంద్రధరుఁ గొల్చు నారాజచంద్రుఁ డెపుడు.

శా. రాజచ్చంద్రశిలాతలాంతరలతారమ్యప్రదేశంబులన్
గాజుంగుప్పెలలో నియచ్ఛతరగంగావారి నోలార్చి యా
రాజున్ దేవియు మంత్రపూతముగ హేరాళంపుఁ బూగుత్తులన్
బూజల్ సేయుదు రిచ్చలం జెలఁగి ముప్పూటం బురారాతికిన్ ౨౪.

క. సంతానకాంక్ష నాశ్రిత । చింతామణి సకలలోకసేవితుఁ గరుణా
స్వాంతుని రాజతశైల ని । శాంతుని భజియింతు రెపుడు సతియుఁ బతియున్.

క. ఆమానవపతి చిత్తా । రామములో నుండ మరగి రాజతభూభృ
త్సీమకయి పోఁదలంపక । సోమకళాధరుఁడు మిగుల సోమరియయ్యెన్. ౨౬.

వ. ఇవ్విధంబునం బరమశైవాచారసంపన్నులగు దంపతు లప్పరమేశ్వరుని సేవింప
నొక్కనాఁడు. ౨౭.

చ. కలగని యమ్మహీవిభుఁడు గ్రక్కున లేచి నిజంబుగా మదిన్
దలఁపుచు మేను గర్పొడవ నల్లడలుం బరికించి యో కృపా
జలనిధి యోమునీంద్రవరసంస్తుత యోజగదేకనాథ నిన్
గలఁ గనుఁగొంటిఁ దొంటికలికల్మషజాలము వీడుకొంటి నే. ౨౮.

మ. అని యంతంతకు నమ్మహామహిమ కత్యాశ్చర్యముం బొంది య
జ్జననాథాగ్రణి పాహిపాహి యనుచున్ సంతానదానక్రియా
జనకంబైనఫలంబు మౌళినిడి వక్షఃపీఠిపైఁ దార్చి లో
చనయుగ్మంబునఁ జేర్చుచుం బొగడుచున్ సంతోషితస్వాంతుఁడై. ౨౯.

ఉ. పాలిక మేలుకొల్పి నరపాలశిఖామణి వింటివే వినీ
లాలక నిన్నరేయి యొకయచ్చెరు వాశ్రితపారిజాత మ
బ్బాలశశాంకమౌళి మనపాలిటికొంగుపసిండి మందమం
దాలసలీల వచ్చె దరహాసవిభాసిముఖారవిందుఁడై. ౩౦.

క. వచ్చి భవద్భక్తికి నే । మెచ్చితి నీఫలము నీసమీహిత మొసఁగున్
బుచ్చుకొనుమనుచుఁ జేతికి । నిచ్చి భవానీశుఁ డరిగెనే లలితాంగీ. ౩౧.

క. అనిపలికి యభవుఁ డిచ్చిన । యనర్ఘ్యఫలము విభుఁడిచ్చె నాత్మాంగన కం
దును శివభక్తులకును గలఁ । గనినఫలం బెన్న నిజముగాఁ జేకుఱుఁగా. ౩౨.

ఉ. ఇచ్చిన మ్రొక్కు పుచ్చుకొని యింపును సొంపును బల్లవింపఁగా
నచ్ఛపలాయతేక్షణ శివార్పణమంచు సుధారసంబుతో
మచ్చరికింపఁజాలురుచిమత్ఫల మాదట నారగించి వా
క్రుచ్చఁగరానిమోదమునకు న్నెలవై వెనుపొందె నంతటన్. ౮౩.

సీ. చూపుఁదేటులపిల్ల లూపాడఁజొచ్చెఁబో యాడక యవియేల యడఁగియుండుఁ
జనుఁగవజక్కవల్ పెనుపొందియుబ్బెఁబో యుబ్బక యవియేల యూరకుండు
వేణికానీలాహి విస్ఫూర్తిమించెఁబో మించక యదియేల మిన్నకుండు
చిఱునవ్వుమొలకలు చిగురొత్తఁదలఁచెఁబో తలఁపక యవియేల నలఁగియుండు
నననఁగ నొకక్రొత్తచెల్వ మయ్యంబుజాత । గంధి కెంతేనిఁగల్గె నక్కనకశైల
కార్ముకానూన కరుణావికాసలబ్ధ । ఫలరసామృతధార లల్పంబె తలఁప. ౮౪.

క. ఈరీతి నమ్మృగేక్షణ । యారూఢమనోనురాగయై యుండుతఱిన్
మేరుమహీధరకార్ముక । కారుణ్యముకతనఁ గొన్ని ఘస్రంబులకున్. ౮౫.

సీ. కానుదొడ్డతనంబుఁగని చింతపడుగతిఁ గుచముఖంబులు నీలరుచి వహించె
మందస్మితంబున మరగిరాదన ముద్దుఁబలుచనిచెక్కులు పలకఁబాఱె
ఫలరసంబులకెవ్వి ప్రతిరామి నొల్లదోయన జిహ్వకన్నిట నరుచిపుట్టె
గర్భస్థుఁడగుబాలుకమనీయగుణభారమహిమనా నడ లతిమందమయ్యెఁ
గలికి బేడిసమీలతోఁ గలహమాడు । వాలుఁజూపులదాటులు డీలుపడియె
మంటికమ్మనితావిపై మనసుపాఱె । నాఁడునాఁటికిఁ బాలికానలినముఖికి. ౮౬.

వ. అట్లు గర్భభరాలసయైన యయ్యంగనకుం బుంసవనాదికృత్యంబులు నిర్వర్తించిన యనంతరంబున నవమాసావసానంబగుటయు శుభముహూర్తంబునఁ గుమారుం డుదయించిన.. ౮౭.

మ. కురిసెం బువ్వులవాన చూపరులచూడ్కుల్ వేడ్కనోలాడఁగా
నెరసె న్నెల్లనిచల్లగాలికొదమల్ నెత్తావినిండారఁగాఁ
బొరసెన్ దిక్కులు నొక్కవింతచెలువంబున్ దక్కుమారప్రతా
పరుచింబోలమినాఁ బ్రశాంతగతి సంప్రాప్తించె వైశ్వానరున్. ౮౮.

ఉ. అప్పుడు బంధుమిత్రసచివాన్వితుఁడై మహనీయవైభవం
బుప్పతిలన్ ధరామరసముత్కరముం బిలిపించి యిచ్చెఁబో
తెప్పలుగాఁ గరుల్ హరులు ధేనువు లంబరముల్ మణివ్రజం
బప్పతి యప్పతిం దెగడునట్టిసమున్నతదానవైఖరిన్. ౮౯.

మ. నరనాగోత్తముఁ డీగతిన్ వివిధదానప్రౌఢిఁ బుత్రోత్సవ
స్ఫురణంబొప్ప ఘటించి సూతకదినంబుల్వచ్చి దాక్షాయణీ
వరకారుణ్యవిశేషబంధుఁ డగుటల్ వర్ణింపుచున్ రాజశే
ఖరనామం బొనరించెఁ బుత్రకునకుం గౌతూహలాయత్తుఁడై. ౯౦.

శా. వైరించప్రతిభావదావదవచోవైయాత్య సాతత్య స
త్యారూఢస్థితిపాండవాగ్రజ మహీయస్స్వచ్ఛకీర్తిచ్ఛటా
పారావారనిమగ్నశత్రుగణ శుంభత్పూర్వభూభృద్దిశా
నారీమన్మథ బంధురక్షణచణా నాదిండ్లవంశాగ్రణీ. ౯౧.

క. చతురతరవచనరచనా । చతురానన త్రిచతురాశ్వసప్తిజవా నీ
చతురంగ ఖురరజోవిక । చతురాష్ణాయనకమల సముద్రగబలా. ౯౨.

మాలిని. హరిచరణపయోజధ్యానసంధానమార్గా
స్థిరమతిగుణధారా శిక్షితాఘప్రచారా
సురసురభివితీర్ణ స్తోత్రపాత్రప్రకారా
గిరిచరదరివీరా కృష్ణమాంబాకుమారా. ౯౩.

గద్య. ఇది శ్రీమదఘోరశివాచార్యగురుకరుణావిశేషలబ్ధ సారస్వత
మాదయామాత్యపుత్ర మల్లయనామధేయ ప్రణీతంబైన
రాజశేఖరచరిత్రంబను మహాప్రబంధంబు
నందుఁ బ్రథమాశ్వాసము.

రాజశేఖరచరిత్రము.

ద్వితీయాశ్వాసము.

క. శ్రీరమణీరమణీయవి । హారాయతనూత్నలోచనాంభోజయుగా
దోరమిత కీర్తినిరసిత । తారకభృత్కాశ యప్పదండాధీశా. ౧.

వ. అవధరింపు మత్తెఱంగున నావర్తితనామకరణాదిసంస్కారుండై ప్రతిదినప్రవర్ధమానుండగుచు నక్కుమారుండు. ౨.

ఉ. నిద్దపురత్నభిత్తిఁ దననీడఁ గనుంగొని తోడనాడున
ముద్దులబాలుఁడంచుఁ గరముల్ పలుమాఱును జాఁచి చీరుచున్
విద్దెముచేయుచుండిరుగు విందులు విందులు విందులంచు నే
ప్రొద్దు నృపాలుఁడున్ సతియుఁ బొంగుచు నక్కున గారవింపఁగన్. ౩.

శా. కేలీకాంచనసౌధవీధికలచక్కిం దొట్లలోఁ బెట్టి యో
ప్రాలేయాచలకన్యకాధవకృపాపారంగతా నిద్రపో
వే లావణ్యపయోనిధీ యనుచు నావిర్భూతమోదంబునన్
జోలల్ పాడుదు రక్కుమారకునకున్ శుద్ధాంతకాంతామణుల్. ౪.

క. అల్లారుబెల్లమై గలు । గల్లున నందియలు మొరయఁగా వేడుకపై
న్వ్రేల్లి మునిఁగించె ధరణీ । వల్లభనందనుఁడు చూచువారలచూడ్కుల్. ౫.

గీ. కలికిఁజూపుల మూడవకన్నసంగ । రత్నములు గీలుకొల్పినరావిరేక
ఫాలభాగంబునను గ్రాల బాలుఁడపుడు । శంబరారాతియభియాతిచంద మయ్యె.

మ. వనితానేత్రచకోరచంద్రికతనుస్వచ్ఛందకాంతిచ్ఛటా
ఖని యుత్సాహకళాఖలూరి మతిరేఖామంత్రసంసిద్ధి భో
గనివాసంబు లతాంతసాయకభుజాగర్వావలంబంబు యా
వన మమ్మానవనాథపుత్రునకు మవ్వంబొప్ప నేతెంచినన్. ౭.

సీ. ధర మొక్కమైఁ దాల్పఁ దరము కాదని భోగివరుఁడు దాల్చినతనుద్వయమనంగ
హృదయగేహముఁ బాసి యీశుఁడేగకయుండ నలవరించినబోరుఁదలుపనంగ
సముదీర్ణలావణ్యజలధిలోఁ జూపట్టు లాలితశైవాలలత యనంగ
నిందిరవిహరింప నెడముగా నజుఁడు గావించిన క్రొందమ్మివిరులనంగ

నిడుదబాహుయుగంబును వెడదయురముఁ। గొమరుమీసలుదీర్ఘ నేత్రములు మెఱయ
మానినీజనమానసమానహరణ । చతురతరమూర్తి యారాజసుతుఁడు మెఱసె. ౮.

ఉ. ఏయుఁ నిశాతబాణముల హేళిఁ బదింబది సూక్ష్మలక్ష్యముల్
త్రోయు సుతప్రఘాణమునఁ దుంగధరాధరశృంగసంఘముల్
వ్రేయు భుజాకృపాణి నవలీల నయోమయపిండఖండముల్
ప్రాయము పెక్కువన్ ధరణిపాలతనూజుఁడు సత్త్వయుక్తుఁడై. ౯.

గీ. ఇత్తెఱంగున యౌవనాయత్తుఁడగుచుఁ । దండ్రియానతి యొక్కింత తప్పవెఱచి
యౌవరాజ్యాభిషిక్తుఁడై యతిశయిల్లె । నఖిలవిద్యానిరూఢిఁ బెంపందియతఁడు.

ఉ. రామునికంటె నప్పరశురామునికంటె ధనుర్విశేష వి
ద్యామహనీయుఁడై మెఱసి యాతఁడు చేతులతీటవో సము
ద్దామవిరోధిబాహుజవితానము నుక్కడఁగించి వీరల
క్ష్మీమదిరాక్షికిన్ వలపు గీల్కొలిపెన్ విషమాస్త్రికేళికిన్. ౧౧.

సీ. కలహభోజనమునిగ్రామణి యాకంట నానాఁట నిటమీఁద నవయకున్నె
దళితారిరక్తాపగలు నిండిపాఱమి వారిధు లిటమీఁద వడియకున్నె
నిజమండలోద్భేదనిర్వేదములుమాని నలినాప్తుఁ డిటమీఁదఁ జెలఁగకున్నె
రంభానిరంతరరతికేళిఁ బౌలస్త్యనందనుం డిటమీఁదఁ బొందకున్నె
యనఘుదర్పితపరిపంధిమనుజపతుల । బీరములుమాన్చి తనపాద పీఠిఁజేరి
కప్పములువెట్టి కొలువ నిష్కంటకముగ। ధాత్రిపాలించె భువనైకజైత్రుఁడగుచు.

వ. ఇవ్విధంబునఁ బ్రజాపాలనంబు చేయుచుండునంత నొక్కనాఁడు హేమధన్వ మహీపాలుండు పేరోలగం బుండుసమయంబున. ౧౩.

చ. కనుఁగవ నిప్పుకల్ చెదరఁగా నదరుల్ వెదచల్లుకెంజడల్
పెనఁగొన నక్షహారములు బిట్టుగ నిట్టటులూఁగ నెంతయున్
గినుకవహించి యొక్కముని కేసరి గొబ్బునఁ జేరవచ్చె న
జ్జనపతియున్ సభాసదులు సాధ్వసమంది వడంకునట్లుగన్. ౧౪.

గీ. అమ్మహామానివచ్చిన యాగ్రహంబు। డెందమువిరియింప గద్దియడిగ్గి మ్రొక్కి
వినయవినమితుఁడైయున్న విభునిఁజూచి। లెక్కసేయకపలికె నమ్మక్కయనఁగ.

క. కాచము రత్నము సరిగాఁ। జూచు మహామహులతపము చూఱలఁ బో నీ
వేచింతయు మదిఁబెట్టవు । రాచతికం బింత చెఱుతురా నరనాథా. ౧౬.

ఉ. ముంపిరి రాజ్యగర్వమున ముందరగానవుగాక ధాత్రిఁ బా
లింపరొ తొంటిరాజులు దిలీపముఖుల్ మునికోటికూఁత లా

లింపరొ నొంపరో మదవిలీఢకఠోరనిశాటఝాటము౯
నింపరొ దిక్కటాహముల నిర్మలకీర్తిసుధాంశుచంద్రికల్. ౧౭.

క. ఘాతుకదైతేయకశా। ఘాతములటె మానివరులకాయములటె యీ
పాతకము కలిగెధాత్రికి। నీతరమున నిట్లుచెల్లునే మముపదల౯. ౧౮

ఉ. పుంద్రకనామధేయమున భూరిభుజాలబలశాలియైన మీ
తండ్రి కవింజరప్రభృతి తాపసముఖ్యులయజ్ఞవేళ పె
క్కండ్ర నిశాటులం దఱిమి కౌశికదైత్యుని నుక్కడంచె నా
తీండ్ర యొకించుకేనివలదే కలదే మఱిదిక్కుధాత్రికిన్. ౧౯

సీ. పరమండలోద్భేదపదము లాలోకించి మంత్రరక్షణకళామహిమదాల్చి
ద్వీపాంతరంబులతెఱఁగు లాకర్ణించి గడినున్నమన్నీల క్రమమెఱింగి
దుర్గాధిపతులసుద్దులు విచారముచేసి బలముల నప్పటప్పటికిఁజూచి
నిజరాజధానిలోనివిశేషముల్గని మంత్రిసామంతులమతము లరసి
పేదసాదలవిన్నపంబాదరించి। వ్రతులమైనట్టి మముబోటివారి నరసి
రాజ్యమేలినఁదగుఁగాక ప్రాజ్యవైభ। వంబుగలదని సుఖియించువాఁడు నృపుఁడె.

సీ. నెమ్మేనితిమిరంబు నేత్రగోళంబులపర కర్ణపుటములప్రత్తి నోరి
వాకట్టుమందు గర్వలతాలవాలంబు వినయకృత్యంబులవేరువిత్తు
కరుణారసంబుతెక్కలికాఁడు మదిచొక్కు పాతకంబులపాలిపట్టుగొమ్మ
మొగమోటకుడుగనిపగ రాజసంబులయిక్కువ గురుసేవకెదురుచుక్క
పరుషవర్తనకునికి లోభంబుటెంకి। బాంధవస్నేహసిందూరపాలకంబు
కలశపాథోధిపుత్రిక్రేఁగంటిచూడ్కి। గాని రాజులనేరమికాదుసువ్వె. ౨౧.

క. అనవిని శివశివయని య। జ్జనపతి వెఱఁగంది యపుడు సవినయముగ న
మ్మునివరువిహితాసనమున।నునిచి భయంబొదవఁగా మృదూక్తులఁ బలికెన్. ౨౨.

క. వెఱపొక యింతయులేకీ। తెఱఁగున మిము నెవ్వఁడింత తెగిచేసెనొకో
యొఱఁగెఱఁగియుండి యకటా। కొఱవిం దలఁగోఁకుకొనుటకుం దలపెట్టెన్. ౨౩

గీ. వికటదైత్యులు నాపేరువిన్నయంత। జలదరించుచు వలయాద్రిచఱులఁగాని
యొందుఁదలచూపవెఱతురింకేమి చెప్ప। నింతకాలంబునకు నొకవింతగంటి. ౨౪.

క. కినుకమెయి నిపుడు మిమ్ముం। గనుగాన కలంచినట్టిగర్వాంధునిఁ దు
త్తునియలు గావించెద నే। నసఘా వినిపింపుమనిన నతఁడిట్లనియెన్. ౨౫.

ఉ. ఏమనిచెప్పవాఁడ ధరణీశ్వర యే వరతంతుసంయమి
గ్రామణిశిష్యుఁడన్ జటిలకౌశికుఁడన్ బహువేదశాస్త్రవి

ద్యాగమహనీయుఁడన్ బదరికాశ్రమవాసుఁడఁ బుత్రికామణిన్
గోమలపాణి భానుమతిఁ గోల్పడివచ్చినవాఁడ నక్కటా. ౨౬.

ఉ. నీకరుణావిశేషమున నెమ్మది నేమికొఱంతలేక య
స్తోకతపోవిధానములు చూఱలుపట్టి సమస్తతాపసా
నీకము నేఁటిదాఁక నతినిశ్చలతన్ వశియించె నిప్పుడ
స్వీకృతనిత్యకర్మమయి చిక్కె విశంకటదైత్యబాధలన్. ౨౭.

సీ. వినవయ్య ధరణీశ విరివియై కవ్వంపుఁగొండచేరువ నొక్కకోనగలదు
బెడఁగైనయక్కోననడుచక్కి మిక్కిలి భీకరంబగు నొక్కబిలముగలదు
తలఁకింతయునులేక తద్బిలద్వారంబు సరణిఁబో నొకరక్తసరసిగలదు
ఘోరతరంబైనయారక్తసరసివెంబడిఁబోవ నట నొక్కబయలుగలదు
పరభయంకర మందొక్క పురముగలదు । తత్పురంబుననుండి సంతతమువచ్చి
యాత్మతరుణి కుడిగముచేయంగవలసి। పొంచి సవరలపాపలఁ గొంచుపోవు. ౨౮.

శా. కాళీదత్తకఠోరలోహమయకంఖాణంబుపై నెక్కి దం
భోళిక్రూరకరాసిఁ ద్రిప్పుచు గళోద్భూతచ్ఛటాకారముల్
గ్రాలన్ గోత్రధరాధరేంద్రములు వ్రీలన్ లీలమై వేడెముల్
దోలున్ ధీయని యక్షకిన్నరపురస్తోమంబు లూటాడఁగన్. ౨౯.

సీ. ఒకవేళ సింహమై యుఱుకుచు బెదరించు నొకవేళ హరిణమై యొద్దనిలుచు
నొకవేళ భూజముల్ పెకలించుఘోణియై యొకవేళ శలభమై యుద్భవిల్లు
నొకవేళ మానియై యొయ్యనొయ్యనవచ్చు నొకవేళ నగ్నియై యుఱుకవెలుఁగు
నొకవేళ మేఘమై యుఱుముచు నేతెంచు నొకవేళ శైలమై యుండునడుమ
నద్దురాత్మునిమాయ లేమనఁగఁగలదు । జపతపోనిష్ఠలేమియు జరగనీక
బదరికాశ్రమసీమ తాపసులనెల్ల । నలఁచి యేచుచు నొక్కనాఁ డదనువేచి. ౩౦.

క. నాచిన్నిముద్దుకూఁతురు । నాచక్కనితల్లి వీధి నడయాడఁగ న
న్నీచు కొనిపోయె సాళ్వము । రాచిలుకం గొంచుపోవు క్రమమునఁ దండ్రీ. ౩౧.

క. ఆసవ యొయ్యననెఱిఁగి మ । హాసురవెనువెంటఁబోవ నదలించి గత
త్రాసుఁడయి చేతికళగొని । వ్రేసెన్నను నిట్లు రోషవివశుండగుచున్. ౩౨.

క. ఏడవ యేటిది యెవ్వరు । వేడుక కదలించిరేని వెక్కుచు నేడ్చున్
జూడ భయంకరయగు తన । చేడియ కుడిగంబు లెట్లుచేయు నృపాలా. ౩౩.

క. అత్త దయామతిఁ దనకడ । నత్తమిలక నిద్రవోవ దహరహమందున్
బొత్తునఁగుడువక తాఁ గడి । యెత్తదు తజ్జనని యింతకేమయ్యో నొకో. ౩౪.

నిష్కపటమును, లీనతయు, మానవునియందుండఁగలుగునంత నీతియు, సద సద్విచారశక్తియు నామెయందు వాసముచేయుచుండినవి. ఇట్లు తనయందు దోషము లేకపోయినను పరులయందుఁగల స్వాభావిక దోషములను ఆమె క్షమించుచుండెను." "అహల్యాభాయినిగుఱించి లోకు లతిశయోక్తులు పలికెదరని దలఁచి, నేనామెవిషయమై సూక్ష్మరీతిగా విచారించితిని; వేరువేరు జనులనడిగితిని. వారందఱును, ఆమె నామము వినఁగానే యనేకముగా స్తుతించుచుండిరి; ఆమె నామముపై నాశీర్వచన వర్షములు గురిపించుచుండిరి. లోకులయొక్క యీపూజ్య బుద్ధియోగ్యమైనది కాదనుటకు నాకొక యాధారమైనను దొరికినదికాదు. ఎంతెంత యధికముగా విచారించితినో యంతంత యెక్కువ కుతూహలము గలుగునట్టి సంగతులే తెలియుచుండెను." "లోకు లీమె నామమునకు సాధువులకుఁదగిన సన్మాన మిచ్చుచున్నారు; నారీమెను దేవతయనియెదరు. ఈమె సద్గుణముల విషయమై యెంతదోషైక దృష్టితో విచారించినను, పృథ్వీపై నేటివఱకుఁ బుట్టిన యత్యంత పవిత్రులైనట్టియు, దూర విచారము గలిగినట్టియు ప్రభువులలో నీమెయొకతెయని చెప్పకతప్పదు." "నిజముగా నహల్యాభాయి యొక యద్వితీయస్త్రీ." మాల్కము దొరగారిట్లు అహల్యాభాయిగారి చరిత్రముకొఱకు ననేకరీతుల శోధించిచూడఁగా నతనికామెయందధిక పూజ్యభావము గలిగి యతఁడు పైనిచెప్పినప్రకార మహల్యాభాయిగారినిగుఱించి వ్రాసియున్నాఁడు. ఇంత నిష్పక్షపాతముగల సాక్ష్యముండఁగా నహల్యాభాయి యద్వితీయస్త్రీయేయని చెప్పుట కేలసందేహింపవలెను.

కన్యావిరహము--అహల్యాభాయిగారికి మంచాబాయియను కూఁతురుండెనని వెనుకనే వ్రాసియుంటిని ఈమెకే ముక్తాభాయియని నామాంతరము. ఈమెకు వివాహముచేసి యహల్యాభాయి యల్లుని నింటనే యుంచుకొనెను. ఈయల్లుఁడు చాల రోజులవఱకు బ్రతికి, యహల్యాభాయిగారి మరణమునకుఁ గొన్నిరోజులు పూర్వము మరణమొందెను. తోడనే ముక్తాభాయి సహగమనమునకు సిద్ధమాయెను. అప్పుడహల్యాభాయి తనకొమార్తెను సహగమనము చేయవలదని, నయభయములతోఁ జెప్పిచూచెనుగాని యందువలన నెంతమాత్రము ప్రయోజనము లేకపోయెను. తల్లిమాట వినక ముక్తాభాయి భర్తతో సహగమనము చేసెను.

ఇట్లు కూఁతురును అల్లుఁడును మృతిఁజెందఁగా నహల్యాభాయిగారికిఁ బ్రబల మనోరోగము ప్రాప్తించెను. వార్ధక్యము, రాజ్యముచేసెడిశ్రమ, వ్రతనియమములు, ఉపవాసములు, కన్యామరణ దుఃఖము మొదలైనవన్నియు నేకీభవించి, యీామెను దినదినము క్షీణదశకుఁ దేసాగెను. తుదకామెకు నొక రుగ్ణత సంభవించి, పుణ్యశ్లోక

యగు అహల్యాభాయి ౧౭౯౫వ సంవత్సరమున నిహలోకమును విడిచెను.

న్యాయముగాఁ బ్రజాపరిపాలనముఁ జేసినందువలన మృతజీవులని విఖ్యాతిని బడసిన భోజరాజు, అశోకనృపతి, అకబరుబాదుషహా, పీటరు ది గ్రేటు మొదలయిన రాజపుంగవులతోనహల్యాభాయి సమానమైనదని చెప్పుటకుసందేహములేదు. అహల్యాభాయిగారియందుఁ గల సుగుణములలో నొక్కొకటిగల రాజులెక్కడనో నూటికి కోటికి నొక్కఁడుగాని కానఁబడకున్నారు! గనుక పురుషులకంటె స్త్రీలు నీతి తక్కువవారనుట కేవలము పక్షపాతముగాదా? సకల మానవకోటికి లలామభూత యయిన యహల్యాభాయి స్త్రీయైయుండ, 'అనృతం సాహసం మాయా మూర్ఖత్వ మతిలోభ' తేద్యాది దుర్గుణములు స్త్రీలకు స్వాభావికములని చెప్పుట ఘోర పాతకమునకు హేతువుగాదా?

రాణీ గౌరీలక్ష్మీభాయి.

"అహహ మహతాం నిస్సీమాన శ్చరిత్ర విభూతయః"

("అహహా! మహాత్ములచరిత్రమహిమ అగాధముగదా ?")

ఈప్రపంచమునం దనేకప్రతిబంధములుండునని ప్రతివారికిని తెలిసినవిషయమే. ఇట్టి ప్రతిబంధములు పదిమందిని సంరక్షించువారికి నెక్కువగానుండును. తన సంరక్షణలోనున్న వారిలోఁ బ్రతివాని స్వభావము వేరువేరుగా నుండుటవలన, వారికోర్కులు దీర్చి, వారినందఱిని నాజ్ఞలోనుంచుకొనుటకు బహుచాతుర్యమును, ధైర్యమును కావలయును. ఒక కుటుంబమును సంరక్షించుట కింత శ్రమయగునప్పు డొకరాజ్యమును వహించుట కెంతశ్రమ కావలయునో వేరుగఁజెప్పనక్కరలేదు. రాజ్యముచేయుటలో నెన్నికష్టములుండునో యవియన్నియుఁ గుటుంబమును భరించువా రూహించుట సుఁభము. రాజ్యములో ననేకప్రకృతుల లోకులుందురు; శౌర్యధైర్యాదులు గల గొప్పగొప్ప శూరులుందురు. పరరాజు లెప్పుడును యుద్ధోత్సాహులయి యుందురు. వీరినందఱిని సమాధానపరచి రాజ్యశకటమును నడుపుట బహుదుస్తరము. ఇందువలననే రాజ్యమును 'రాజ్యభార' మనియెదరు. ఈభారమును వహించుటకు విద్య, సారాసార విచారము, దక్షత మొదలైన సద్గుణము లనేకములు గావలయును. ఒకానొక సమయమునం దీరాజ్యభారము యౌవనమునందే వహించుట సంప్రాప్తమైన పక్షమున నదియెంత దుస్సహమగునో వేరు చెప్పవలెనా? ఇన్నిసంగులు లేకీభవించి యీరాజ్య

శకటమొక స్త్రీకి సంప్రాప్తమైన పక్షమున నామెయెటులఁ జేయునో యని మనకాశ్చర్యము దోచును. కాని యీశ్వరానుగ్రహము వలన జగత్తునం దెప్పుడెప్పు డెచ్చటెచ్చట స్త్రీలకు రాజ్యాధికారము దొరికెనో యప్పుడప్పు డచ్చటచ్చట స్త్రీలు పురుషులకంటె నధిక ధైర్యముతోను, అధిక నీతితోను, అధిక న్యాయముతోను రాజ్యముఁ జేసిరని చరిత్రమువలనఁ దేటపడుచున్నది. ఇదివఱకీచరిత్రమాలయందు గ్రుచ్చఁబడిన రాణీభవానీగారి చరిత్రము, నహల్యాభాయిగారి చరిత్రయు నీసిద్ధాంతమునే స్థాపించుచున్నవి. ప్రతిదేశముయొక్క చరిత్రమునుండియు నిట్టియుదాహరణము లనేకము లియ్యవచ్చును. నేడు మలబారుదేశమునుండి యొక యుదాహరణ మియ్యఁదలఁచితిని.

మలబారుదేశమునందు త్రావణకోరనియు, కోచీయనియు రెండు సంస్థానములు గలవు. అందు త్రావణకోరు రాజ్య మతిప్రాచీనకాలమునుండి దానధర్మముల విషయమై విఖ్యాతినిజెంది శ్రేష్ఠమైయొప్పును. ఈదేశమును మనయాంధ్రు లాడమళయాళమనియెదరు. ఇచ్చట మగవారేలేరనియు, అందఱు ఆడవారేయనియు, గాలికే పిల్లలు పుట్టెదరనియు మనయాంధ్రులు వింతకథలు చెప్పుకొనియెదరు. కాని యివి యన్నియు నిజమైనసంగతులు కావు. వారియాచార విచారములకును, మనయాచార విచారములకును ముఖ్యభేదము లేవనఁగా:—

ఆదేశమునందు మనదేశమునందలి రీతిగాఁ దండ్రిసొత్తు కుమారునికిఁ జెందక మేనల్లునికిఁ జెందును. మేనల్లుఁడు లేకపోయిన యెడల మేనకోడలికిని, ఆమె సంతతికిని జెందును. ఇటుల నచ్చటఁ గన్యావంశమునకే రాజ్యముయొక్క హక్కుగాని పుత్రవంశమునకులేదు. రాజపుత్రి తొమ్మిది పదిసంవత్సరములది కాఁగానే, తాళికట్టుటయను ఒకవివాహ విధిఁజేసెదరు. అందు భర్తయుండఁడు. పురోహితుఁడే చిన్నదానికి మంగళసూత్రము కట్టును. రాజకన్యకు యౌవనదశ ప్రాప్తమైన తరువాత నొక నంబూరిబ్రాహ్మణుని దెచ్చి యీమెకు వివాహముఁజేసెదరు. ఇతనిని 'కోవిలతంబూరాన్' అనఁగా రాజభవనములోనిమహారాజుఅనిపిలిచెదరు. ఈకోవిలతంబూరానునకును, రాజకన్యకును గలిగిన యాడుబిడ్డలయొక్క సంతతికి రాజ్యము దొరుకును. ముఖ్యముగా నీయాడుబిడ్డల పుత్రులకు రాజ్యము దొరుకును. పుత్రులులేని పక్షమున కన్యలకుదొరుకును. రాజ్యముపైనున్న రాజుయొక్కభార్య రాణీగానేరదు. ఆరాజుయొక్క కుమారులకు వారిమేనమామసొత్తు లభించునేగాని రాజ్యము లభింప నేరదు. వారెన్నడును యువరాజులుగానేరరు. ఇంతజ్ఞాపకముండిన నీచరిత్రము దెలియుటకు సులభమగును.

త్రావణకోరు సింహాసనముపై ననేక స్త్రీలు ఆరూఢలైరి. వారిలో లక్ష్మీబాయి ప్రముఖురాలు. లక్ష్మీబాయికిఁ బూర్వమనఁగాఁ బందొమ్మిదవ శతాబ్దారంభమున వంచి

పాల బలరామశర్మగారీరాజ్యమును ప్రతిపాలించుచుండిరి. ఈరాజుగారంతగా రాజ్యపరిపాలనమునందు దక్షులుగారైరి. అందుచే బీదలకు న్యాయవిమర్శనము లేక పోయెను. గొప్పయధికారులు వారివారి పనులయందలక్ష్యము చేయసాగిరి. కొద్దియధికారులను లెక్కయడుగువారులేనందున రాజుగారికి రావలసిన పన్నులు రాకపోయెను. ఇట్లొకరినొకరు లక్ష్యము చేయనందువలన రాజ్యమంతయు భర్తలేని భార్యవలె దీనదశకు వచ్చెను. అప్పు డీస్టిండియా కంపనీవారు, రెసిడెంటుద్వారా మీరు మీరాజ్యమును జక్కపెట్టుకొని, మంచిదశకుఁ దెచ్చుకొనవలసినదని యనేకపర్యాయములు రాజుగారికి సూచించిరి. రాజుగారాసూచనలను లక్ష్యపెట్టనందున రాజ్యముయొక్క దీనదశ దినదినము హెచ్చుచుండెను. ఇదిచూచి ఈస్టు ఇండియా కంపనీవారు ౧౮౧౦వ సంవత్సరమునందు "మీరు రాజ్యముయొక్క స్థితిని ఆఱు మాసములలో బాగుపఱచినసరె; లేనియెడల మీరాజ్యము బందోబస్తు మేము చేసెదము"ని రాజుగారికిఁ దెలియఁజేసిరి. ఇందుచే రాజు చింతాక్రాంతుఁడై కొద్దిదినములలోనే పరలోకగతుఁడయ్యెను.

పంచిపాల బలరామశర్మగారి తదనంతరము రాజ్యారూఢుఁ డగుటకు మగవారసదారుఁ డెవఁడును లేకపోయెను. రాజుగారి తల్లియు, అక్కగారగు గౌరీబాయిగారును, అదివఱకే మృతిఁజెందిరి. గౌరీబాయిగారికి మగసంతానము లేకయుండెను. కాని యామెకు లక్ష్మీబాయి యనియుఁ బార్వతీబాయి యనియు నిరువురు కొమార్తెలుండిరి. వీరును బాల్యావస్థలోనే యున్నందున వీరికిని సంతానప్రాప్తి కాకపోయెను. కనుకఁ బెద్దదియగు లక్ష్మీబాయి రాజ్యముఁ జేయవలయుననియు, నామెకు కుమారుఁడు గలిగిన నతఁడు రాజ్యమునకు వారసదారుఁడనియుఁ గంపనీవా రేర్పాటుఁజేసిరి. ఈ యేర్పాటునకు ముఖ్యకారణము లక్ష్మీబాయిగారి తెలివియే. లక్ష్మీ పార్వతులిద్దరును, స్వదేశభాషయందును, సంస్కృతభాషయందును మిక్కిలి ప్రవీణురాండ్రై, సుశీలలనఁ బ్రసిద్ధిగాంచిరి. అందు లక్ష్మీబాయి యిరువది సంవత్సరముల వయస్సుగలదైనను, సుగుణములకును, దీర్ఘాలోచనకును, ప్రశంస నీయమైన యుక్తులకును, శతవృద్ధురాలికంటెఁ బ్రసిద్ధిగాంచినది గనుక, అప్పటి రెసిడెంటుగారగు కర్నెల్ మెకాలే దొరగారు, త్రావణకోరు సింహాసనముపై నుంచుట కీమెయే యర్హురాలనియెంచి, ఈసంగతి కంపనీవారికిఁ దెలిపి "ఈమె చిన్నదైనను, ఇదివఱ కీరాజ్యమునందుఁగల యవ్యవస్థను దొలఁగించి, రాజ్యమును ఉన్నతస్థితికిఁ దెచ్చు సద్గుణము లీమెయందుఁ గలవు" అని తన యభిప్రాయము వ్రాసెను. కంపనీవా రిది యంతయువిని, లక్ష్మీబాయిని సింహాసనారూఢురాలను జేయుటకై యామోదించి, యామహోత్సవము యథావిధిగా నడుపుటకై రెసిడెంటు కర్నెల్ మెకాలే దొరగారినె నియమించిరి. కాని యింతలో లక్ష్మీ

బాయిగారి దాయాదులు కొందఱా సింహాసనముపై తమకు సంపూర్ణముగా హక్కు గల దనియు, హక్కుదారులు తమరుండఁగా నాఁడుపిల్లలకు రాజ్యమిచ్చుట న్యాయము కాదనియుఁ జెప్పఁదొడఁగిరి. కాని మెకాలే దొరగారు వారి జల్పనలను లక్ష్యపెట్టిన వాఁడుకాఁడు. కనుక వారు తిరుగఁబడిరి. అందుపై వారిని, వారికి సహాయులుగ నున్నవారిని, రాజద్రోహులని కర్నెల్ మెకాలేగారు, కారాగృహమునకుఁ బంపిరి. మొదలు వీరు తేలీచేరీయను పట్టణమున నుంచఁబడిరి గాని తరువాత చెంగల్పేటకుఁ బంపఁబడిరి. అచ్చట వారందఱును కారాగృహములోనే మృతిఁజెందిరి.

ఇట్లు శత్రువుల నందఱిని ఘోరముగా శిక్షించిన తరువాత, లక్ష్మీబాయిగారికిఁ బట్టాభిషేకము గట్టుటకై రెసిడెంటు దొరగారు గొప్ప యుత్సవముఁజేసిరి; గొప్ప రాజసభఁజేసిరి. రాజసభఁజేసిన యాస్థానమంటప మనేకసుందరపదార్థములవలన నలంకరింపఁబడి చూచువారికెంతయు నాహ్లాద జనకముగానుండెను. ఆమహోత్సవముఁ జూచుటకై రాజ్యముయొక్క భిన్నప్రదేశములనుండి యనేకజనులు వచ్చియుండిరి. ముఖ్యముఖ్య సామంత సర్దారులందఱు వచ్చి వారివారి నియమిత స్థానములయం దాసన్నులైనపిమ్మట రాజకన్యలగు లక్ష్మీ పార్వతులు వారి దేశాచారము ననుసరించి, యుత్తమ వస్త్రాభూషణా లంకారములను ధరించివచ్చి, సభయందు వారికొఱకు నియమింపఁబడిన యున్నతాసనములపైఁ గూర్చుండిరి. తరువాత కంపనీవారి ప్రతినిధియయిన కర్నల్ మెకాలే దొరగారు నిలుచఁబడి, యచ్చటి సభవారందఱువిన "కంపనీ సర్కారు వారి యనుమతిప్రకారము, రాణీ లక్ష్మీబాయిగారిని త్రావణకోరు సింహాసనముపైఁ గూర్చుండపెట్టుచున్నాను" అని మృదుమధుర గంభీరస్వరముతోఁ బలికి, సన్మానపూర్వకముగా రాణీ లక్ష్మీబాయిని ఉచ్చస్థానమునందున్న రాజసింహాసనముపైఁ గూర్చుండఁబెట్టెను. అప్పుడే సర్వజనుల యనుమతిని బడసి యాయన రాణీగారికి 'ధర్మవర్ధని' 'రాజరాజేశ్వరి' యన్న బిరుదులఁగూడ సంరంభముతో నొసఁగెను. ఇచ్చటచదువరులు రాణీగారికి ధర్మవర్ధనియన్న బిరుదుతోఁ బ్రయోజనమేమి యని శంకింతురేమో. కనుక కొద్దిగావివరించెద. త్రావణకోరురాజ్యముయొక్క రాజధానియగు త్రివేంద్రమునకేఅనంతశయనమనిపేరు. ఇది యొక క్షేత్రమై యొప్పును. ఇచ్చట పద్మనాభస్వామి శేషశయనుఁడై యుండును. త్రావణకోరురాజుల కులదేవత యీపద్మనాభులే. రాణీగారి పూర్వుఁడగు మార్తాండవర్మ, తనరాజ్యమంతయు నొకనాఁ డీదేవునికి సమర్పించెనఁట! అప్పటినుండియు. ఈరాజులు తమకు 'పద్మనాభసేవకు' లనియు 'ధర్మవర్ధకు' లనియు బిరుదులనేర్పరచుకొనిరి. వీరి రాజముద్రయందు "ధర్మోస్మత్కులదైవతం" అనువాక్యముండును. ఇట్లు ప్రతిరాజును, రాణియు, 'ధర్మవర్ధనుఁడు' 'ధర్మవర్ధని' యన్న బిరు

దును భూషణముగాఁ దలఁచుచుండిరి. కనుక రాణీగారికి 'ధర్మవర్ధిని' యన్న పదవి రాజ్యారోహణ సమయమున నియ్యఁబడెను. మహారాణీగారి సంపూర్ణ నామము, బిరుదులతో మలయాళమునం దిట్లు వ్రాయఁబడును. "శ్రీపద్మనాభసేవినీ వంచి ధర్మవర్ధినీ రాజరాజేశ్వరీ రాణీగారీ లక్ష్మీబాయి."

రాజ్యాభిషేకమయిన తరువాత ముహూర్తకాలమునకు రాణీ లక్ష్మీబాయిగారు సింహాసనంబుడిగ్గి, ప్రఫుల్లముఖముతో మెకాలేదొరగారిని, సకల సభ్యులను సంబోధించి మలబారీభాషలో నస్ఖలితముగా నిట్లు సంభాషించెను:—

"ఆదరం బహుమాన పెట్టసాహేబే—పరమ సన్మాననీయులగు కర్నలుదొరగారు-అనాదికాలమునుండి మాపూర్వులచేఁ బాలింపఁ బడినట్టియు, ఈస్టుఇండియా కంపనీ వారిచే నేటివఱకు సంరక్షింపఁబడినట్టియు, ఈత్రావణకోరు సింహాసనము నాకుఁ బ్రాప్తించునని నేనిదివఱకు స్వప్నమందైనను అనుకొనినదాననుగాను. ఇప్పు డీశ్వరేచ్ఛచేఁ బరలోకవాసులైన మామామగారగు వంచిపాలవర్మ మహారాజుగారు కేవల మిరువదితొమ్మిది సంవత్సరముల ప్రాయముగలవారు. ఆయన మామగారు ధరించినట్లు రాజ్యదండ మీయనదీర్ఘకాలమువఱకు ధరించవలయునని పద్మనాభస్వామివారి యాజ్ఞ లేకపోయెను. ఆపద్మనాభస్వామిగారి యిచ్ఛానుసారమే నాకురాజ్యము ప్రాప్తమైనది. కనుక నాయనయాజ్ఞ నాకు శిరసావంద్యము. నేను స్వామియాజ్ఞను శిరసావహించుటకు సిద్ధముగానున్నాను. కాని నేను అబలను; అదియునుగాక యల్పవయస్కురాలను; ఇట్టి గొప్పరాజ్యకార్యముల యనుభవము లేనిదానను. మాతో స్నేహమైనప్పటినుండియు, ఈత్రావణకోరు రాజ్యమును కన్నబిడ్డవలెఁ గాపాడుచువచ్చిన ఆనరేబిల్ ఈష్టు ఇండియాకంపనీవారు దప్ప నాకిట్టి స్థితియందు రెండవ యాధారము లేదు. కనుక కర్నలుగారు, నేటినుండి మిమ్మును నేను సొంతయన్నగా భావించి, రాజ్యముయొక్క ప్రతికార్యమునందును విశ్వాసపూర్వముగా మీమీఁద నే సర్వభారమును వేయుచున్నాను. ఇంతకంటె నధిక మేమియుఁ జెప్పవలసినది లేదు." ఈమె గంభీర సంభాషణవిని సభికులందఱు తల్లీనులైరట!

లక్ష్మీబాయి యల్పవయస్కురాలైనందున నామెయెట్టిస్వభావము గలదియగునో, రాజ్యమెటులుచేయునో, ప్రాప్తమైన యధికారమెటుల నిర్వహించుకొనునోయని లోకులకు విచారముగానుండెను. కాని యామె నిర్భయముగా సింహాసనముదిగి, వాక్ప్రౌఢిమయందు దసమానప్రజ్ఞ గలిగి సభాసదులను తన యిచ్ఛప్రకారమాడించెడి వాగ్మివలె లక్ష్మీభాయి గంభీరరవముతో సంభాషించుటవిని యచ్చటివారందఱును మిక్కిలి యాశ్చర్యమునొందిరి. ఆసంభాషణ విన్నవారందఱును, ఈమె సామాన్య

రాలుకాదనియు, నసమాన ప్రజ్ఞగలదనియు, నీమెరాజ్యమునందుఁ బ్రజలకు సుఖమే గాని దుఃఖము లేదనియు నిశ్చయించిరి. ఆమె మధురగంభీరవాక్యములను విని కర్నలు మెకాలే యామెయం దధిక పూజ్యభావము గలవాఁడై ప్రతికార్యమందును ఆమెకు సహాయముఁ జేయుదునని నమ్మిక పుట్టునట్లు చెప్పెను.

ఈప్రకార మారాజ్యాభిషేక మహోత్సవము సమాప్తమై లక్ష్మీబాయిగారిపై రాజ్య నిర్వాహకత్వము మోపఁబడినతోడనే యామె ప్రజలక్షేమమునకై యత్నింపఁ దొడఁగెను. ఆమెదూరదృష్టియు, దీర్ఘాలోచనయు, సమయజ్ఞత్వమును, సూక్ష్మగ్రాహకత్వమును బహుప్రశంసనీయములు. అంత చిన్నతనమునం దామెబుద్ధి విశాలతఁ జూడఁగా నత్యంతాశ్చర్యమునుబొంది, యామె వయస్సునందు బాలయైనను మనస్సునందుఁ బ్రౌఢయేయని చెప్పవలయును. తన రాజ్యమునందంతటను, పరిపూర్ణన్యాయ ముండవలయునని యామెకోరికయుండెను. దీనదశకువచ్చిన తనరాజ్యమును, ఏప్రకారముగానైన నున్నతదశకుఁ దేవలయునని మనస్సా యిచ్ఛగలదై, రాజ్యపద్ధతియం దే యేసంస్కరణము లెట్లెట్లు చేయవలయునోయని రేయుంబగలును మనసులో యోచించుచుండెను. పరులనేత్రములతోఁ జూచుట యామె కెన్నడును ఇష్టము లేకపోయెను. అనఁగా సొంతముగా తాను యోచించక, యితరులు చెప్పినటుల నడుచుట యామె యెన్నఁడును సమ్మతించినదికాదు. మెకాలేదొరగారిని ఈమె యన్నయని భావించినదినిజమే ; నమ్మికతో నతనిచే ననేకరాజకార్యములను జేయించినది నిజమే ; ప్రతిసంగతినిగుఱించి యతని సలహాయడుగుచుండెనన్న మాటయునిజమే. కాని కార్యముఁ జేయునప్పుడీమె,

"క. వినవలె నెవ్వరుచెప్పిన ।
వినినంతనె తమకపడక వివరింపవలెన్ ।
వినికని వివరముఁ దెలిసిన ।
మనుజుఁడుపో నీతిపరుఁడు మహిలోవేమా॥"

అను వేమనయొక్క చక్కనియుపదేశప్రకారము నడుచుచుండెను. క్రొత్తచట్టములు చేయుటయందును, ప్రాతచట్టములను సంస్కరించుటయందును, నాగరీకతవృద్ధిపఱచుట యందును, సొంతముగా రాణీగా రనేకనూతన కల్పనలు మెకాలేదొరగారికిఁ దెలిపిరి. ఇందుచే రాణీగారి యసామాన్యబుద్ధి వైభవము వ్యక్తమగుచున్నది.

వంచిపాల బలరామవర్మగారి రాజ్యమునం దత్యంతాస్వస్థత యేల గలిగెననియు, నిప్పుడది యెటుల సంస్కరింపవచ్చుననియు రాణీగారు యోచింపసాగిరి. ఉమనితాంబీయన్న కుమంత్రియొక్క దుశ్చేష్టలచే నింతవచ్చెనని రాణీగారికిఁ దెలిసెను. ఈసంగతి తెలిసినతోడనే రాణీగా రాకుమంత్రిని పనిమీఁదినుండి తీసివేసెను. తరు

వాత (యోగ్యుఁడైన దివాన్ దొరకువఱకు మీరే యీపనిని జూడవలసినది'ని రాణీ గారు మెకాలేగారి నడిగిరి. అందు కాతఁడు సమ్మతించి రెసిడెంటుపనియు, దివాన్ పనియు నిర్వహించుచుండెను.

మెకాలేదొరగారు దివాన్‌గిరి చేతఁబూనినతోడనే యాయన చేయవలసినపను లనుగుఱించి, యతనికి రాణీగారిట్లు వ్రాసిపంపిరి:—(౧) మా రాజ్యములోని యధి కారులందఱు తమతమ పనులను తిన్నగా చేయుచున్నారాలేదా; క్రింది యధికారులు పైయధికారుల యాజ్ఞలను వినుచున్నారాలేదాయన్న యంశమును మొట్టమొదట విచా రించవలసినది. (౨) న్యాయస్థానములయందేమి, యితరకచేరీలలోనేమి, నియామకముగా పనులు జరుగుచున్నవా లేవాయని విచారించి తప్పక యటులజరుగుటకై బందోబస్తు చేయవలయును. (౩) ఎవరైన సంస్థానములోని యుద్యోగస్థులు తిన్నగాఁ బనులు చేయనియెడల వారికి దండుగలు మొదలైన స్వల్పశిక్షలు విధించి, వారిని త్రోవకుఁ దేవలసినదే కాని యకాయకి యెవరినోటిముందరి తిండియుఁ దీయవలదు. (౪) వసూలు లెక్కలు తిన్నగాఁజూచి వెనుకటి బాకీలన్నియు వసూలు చేయవలసినది.

ఈపైనిచెప్పిన సంగతులన్నియు రాణీగారు సొంతముగా యోచించివ్రాసినవే. ఆమెబుద్ధివికాసమిందువలనను గూడ వ్యక్తమగుచున్నది. పైని వ్రాసినప్రకారము రాణీగా రాజ్ఞాపించినతోడనే, మెకాలేదొరగా రాయాపనులను చేయ నారంభించిరి. మొదట సర్కారు ఉద్యోగస్థులందఱు తమతమ పనులను చట్టముల నియామకప్రకా రము చేయుచుండవలయునని యొక యాజ్ఞాపత్రిక ప్రతి గ్రామములోని యుద్యో గస్థులకుఁ బంపెను. వారందఱు తనయాజ్ఞప్రకారము నడిచెదరోలేదోయనిచూచుటకై మెకాలేగారు సొంతముగా రాజ్యములోని ప్రతిగ్రామమునకుఁ దిరుగుచుండిరి. ప్రథ మమునందాయన కనేకసంకటములు వచ్చెను. కాని వానికన్నిటికి నోర్చుకొని, మిక్కిలి ప్రయాసపడి మెకాలేగారు తుదకన్నిసంగతులను రాణీగారి యిష్టప్రకా రమే సంస్కరించెను. క్రిందటిరాజుగారి రాజ్యములోని యలవాటుచొప్పున నుద్యో గస్థులందఱు మిక్కిలిసోమరిపోతులై, మెకాలేగారి యెంతకఠినపు ఆజ్ఞలనైనను లక్ష్య పెట్టకపోయిరి. ఇట్లు నిర్భయులయి నిదురఁబోవుచున్నవారి నందఱిని మెకాలే దొరగారు మేలుకొలుపుచుండిరి. చేతనైనంతవఱకు వారిని ఉద్యోగములనుండి తొలఁగించక, చిన్నపిల్లలకుఁ గొట్టి బుద్ధిచెప్పినటుల, దండుగ మొదలైనవానిచే శిక్షించి త్రోవకుఁ దెచ్చుచుండెను. కాని కొందఱినిమాత్రము ఉద్యోగములనుండి తీయక విధిలేకపోయెను. ఈప్రకారమంతటను బందోబస్తున కారంభముకాగానే రాజ్యము లోని వ్యాపారములు నియామక ప్రకారము జరుగసాగెను.

శ్రీ

హంపీ (పంపా) దర్శని.

1. శ్రీహేమకూటాద్రియందు, తుంగభద్రా తీరమున, పంపాదేవి శ్రీ విరూపాక్షునిగూర్చి తపం బొనరించి, వారి యనుగ్రహమొంది, వారిని భర్తగా స్వీకరించిరనియు, నా క్షేత్రంబు పంపాక్షేత్రమనియు, భర్తపేరు పంపాపతియనియు, ఇత్యాది సంగతులు పంపామాహాత్మ్యమందుఁగలవు. ఈపంపా గ్రామమునకు ''హంపి'' యను పేరు కన్నడభాషలో నిప్పటికి వాడుక. దానినిగూర్చి వ్రాయఁదలంచితి. శ్రీ విద్యారణ్యులు క్రీ. శ. ౧౩౩౬ వ సంవత్సరమున నా స్థలములో శ్రీ విద్యానగరమును గట్టించి విజయనగరప్రభువుల కిచ్చిరి. దానికి విజయనగరమనియు రాజులు నామ మిడిరి. పూర్వము దానియందుండు రాజులు బహుదేశముల జయించి, దానధర్మములును, విద్యాభివృద్ధిని, విశేషముగఁజేసి, ఖ్యాతికెక్కిరి. ఈగ్రామము బళ్లారికి ౩౬ మైళ్ల దూరములోనున్న సదరన్ మహరాటా రైలుస్టేషన్ అయిన హొసపేట (కొత్తపేట) కు ౭ మైళ్ల దూరమున నుత్తరముననున్నది. అక్కడ పూర్వోన్నత్యమును దెలుపు పాడుపడిన యిండ్లు, దేవాలయములు, విశేషముగనున్నవి.

2. 'హొసపేట'కు దరిదాపుగనె సదరునాశనములు, అగుపడును. కాని పూర్వపు విజయనగర సంస్థానపు రాజధానియొక్క నాశనముల మధ్యను 'కామలాపురమ'ను నొక గ్రామముకలదు. అక్కడ బసదిగుటకుఁ దగిన బంగళాయున్నది.

3. హొసపేటనుండి ప్రయాణము చేసినచో హంపికి వెళ్ళుదారిలో 'అనంతశయనుగుడి' యను గొప్పగుడి ఉన్నది. ఆగుడి యిపుడు పాడుపడియున్నది కాని, ఆదిశేషునిమీఁద పవ్వళించియుండు శ్రీవిష్ణు విగ్రహము ఏక శిలమీఁదనే చెక్కినదానిని దూర్చుటకు తగినంత పొడుగుగల దర్జ అనుకమానుగలిగి ఉన్నది. ఇది చూడయోగ్యమయి యున్నది. సదరు విష్ణు విగ్రహము హూవినహడగలి తాలూకా హొళల్లు గ్రామములో నిప్పటికినున్నది. ఈగుడిలో గొల్లలు గాపురమున్నారు.

4. అనంతశయను గుడినుండి హొసపేటకు ౨౹ మయిళ్ళ దూరములో దూర్పున నున్న 'మలపనగుడి'కి రోడ్డు తిరుగును. అక్కడ పాడుపడిన శివాలయమున్నది. ఆగ్రామమునకుఁ దూర్పున నొకచేనిలో పరుండఁబెట్టిన రాతిమీఁద విజయనగర ప్రభువయిన దేవరాయఁడు A. D. క్రీ. శ. ౧౪౧౦వ సంవత్సరమున దానముచేసిన యొక శాసనమున్నది.

5. ఇక్కడనే శ్రీ విద్యానగరముయొక్క యేడు ప్రాకారములలోని రెంటి గుర్తులు కనఁబడుచున్నవి. వాని పక్కనే రోడ్డువేసినారు.

6. ఈరోడ్డుమీఁదనుండి పక్కనున్న మైదానములోని గుండ్రమైన గోపురములు గల రెండుమూడు చిన్నచిన్న దేవాలయములు అగుపడును. అక్కడనుండి ౨౦౦ లేక ౩౦౦ గజములు పోఁగాఁ బెద్ద చెరువు కనఁబడును. దాని గట్టుపక్కనే 'కామలాపురము'నకు రోడ్డు ఉన్నది.

7. ఆయూరిలో నొక టప్పాలు ఆఫీసు, బాటసారులు దిగుటకు నొక బంగళా యున్నవి. బళ్లారి జిల్లాకు కలెక్టరుగారైన J. H. మాస్టరుగారు, ప్రాచీనమండపమును బంగళాగా మార్పించి లోకల్ ఫండు బోర్డువారి వశముచేసినారు. అక్కడి నుండి ముందు చెప్పఁబోవు నాశనములను జూచుటకు వెళ్ళిన ననుకూలముగ నుండును గాన మన బాటసారి నక్కడికి ముందుగఁ దీసికొనిపోదము.

8. ప్రాచీన నగరముయొక్క స్థలముచేరి బాటసారి కొంత విశ్రమించి తరువాత దానిని సవిస్తరముగఁ జూడనగు. అక్కడ త్రిభుజాకారముగ రెండు రోడ్లు కలియును. ఒకటి హంపిలోనున్న ముఖ్యదేవాలయమగు శ్రీ విరూపాక్ష దేవాలయమునకు వెళ్ళును. రెండవది 'తల్వారకట్ట' అను తుంగభద్రను దాటు రేవుదగ్గఱకు వెళ్ళును. రేవుకు నవతలప్రక్క విజయనగర రాజుల్ల వంశస్థుల ప్రస్తుతపు రాజధానియగు 'ఆనెగొంది' (ఏనుగుసందు) నదినంటియున్నది. మూడవప్రక్కను దుంగభద్రనదియేయున్నది.

9. కామలాపుర సమీపమున కొండలచేత దట్టముగ వ్యాపించి యుండుటచే నెగుడుదిగుడు స్థలములయందు పూర్వపు రాజులయొక్క మహాళ్ళు (మేడలు) ఉండిన స్థలము అగుపడును. సదరు స్థలమంత రమణీయము కాకపోయినను, చాల భద్రమని అక్కడ రాజులు మహాళ్ళను గట్టియుండవచ్చును. చుట్టునుండు కొండలు సహజములయిన ప్రాకారములు బురుజులు అయ్యెను. మఱియుఁ జెక్కి పెట్టినట్లు కనఁబడు రాళ్ళ గుట్టలతో దేవాలయములను, విశాలమైనచావళ్ళను, గట్టుటకును ఏకశిలావిగ్రహములను వానిలోఁ జెక్కుటకును వీలుగానుండెను.

10. బంగళాయొద్దనుండి కోటగోడగుండ నగరమధ్యమునకు రోడ్డుపోవుచున్నది. ఆత్రోవ భద్రము నిమిత్తము వంకరటింకరగానున్నది. కొంతదూరముపోయిన తరువాత మెట్టమీఁద 'చంద్రశేఖరమఠము' అను గుడియున్నది. అందులో విశేషమైనదికాని రమ్యమైనదికాని ఏమియులేనందున దానిని పరరాజులు పాడుచేయక విడిచిరి. కనుక నది యథాస్థితిలోనున్నది. కాని తక్కినగుళ్ళవలె గర్భగుడిలో విగ్రహముమట్టుకు లేదు.

11. ఈగుడిదగ్గఱ నంతఃపుర స్త్రీల స్నానగృహము అగుపడును. దానిదగ్గఱ

మెట్టుమీఁద నదిలోనుండి నీళ్ళను దీసికొనివచ్చు మోరీ అను కాలువయున్నది. స్నానగృహము నలుచదురముగనున్నది. దానియందు కమానులుగలిగిన ద్వారములున్నవి. ఇది హిందువులయొక్కయు, తురకలయొక్కయు, శిల్పవిద్యల ననుసరించి కట్టఁబడినట్లు అగుపడుచున్నది.

12. లోపలగదులలోనుండు నలంకారములఁ జూడఁగ గృహముయొక్క పూర్వపుస్థితిని తురకలు చాలభాగము మార్చినటు లగుపడును.

13. స్నానగృహమునకు పావుమైలు దూరములో నెనిమిది యిండ్లున్నవి. అవి చౌకుయొక్క మూడువైపుల నున్నటులఁ గానుపించును. నాలుగవది ఖాలీగా ఉన్నది. మధ్యది రాజు నంతఃపురము. చుట్టుప్రక్కల నుండునిండ్లు రాజుజనానాలవి. పదునొకండు ఏనుగులు కట్టివేయుస్థలములున్నను, ఆదేశపురాజుల యౌన్నత్యమునకుఁ దగినటుల నింక నెక్కువయే యుండఁదగు. మఱియు నారాజుల యౌన్నత్యమునకును, సేనావిశేషమునకును, తక్కువగానే యున్నవి. బహుశః ఉత్సవములలోఁ ద్రిప్పు ఏనుఁగుల మాత్రము అక్కడకట్టివేసి యుండవచ్చును. ఏనుఁగు తబేలాలు చాలనెత్తుగాను, విశాలముగానుఉన్నవి. వానిలో నున్న మధ్యచావడికి మిద్దె ఉన్నది. దానిలో బహుశః రాజు సొంతయేనుఁగును గట్టియుండవచ్చును.

14. అంతఃపురము చాల నెత్తుప్రదేశములలో నున్నమిద్దె. దానికి నేడు కమానులుగల వరాండాలు దించినారు. అందులోఁ బదునొకండు కమానులు గలవు. మధ్యది లోపలిగదిలోవఱకు వ్యాపించి యున్నది. ఇపుడు ఆగుమ్మములమీఁదను, దరవాజామీఁదను, ఇతర స్థలములమీఁదను, చెట్లుచేమలు విశేషముగ ప్రసరించియున్నవి.

15. జనానా అని పిలువఁబడు స్థలము బలిష్ఠముగ నలుచదురముగ నున్నది. ఇప్పటికిఁ గొంతభాగము మాత్రము కనఁబడుచున్నది. పెద్దరాతిగోడ చుట్టునున్నది. ఆగోడ చిన్నచిన్నరాళ్లతో కట్టఁబడియున్నది. కనుక దానియుద్దేశము స్త్రీజనానా (ఘోషా) సంరక్షణకేగాని దండయాత్రను నెదురుకొనుటకుఁ గాదు. త్రిభుజాకారముగానుండి యెత్తుగానుండు పైకప్పుల మీది మిద్దెలు, ఇప్పటికిఁ గొన్నికనఁబడు చున్నవి. ఒకటి స్పష్టముగానున్నది. ఇంకఁదక్కినవాని నాశనములను గ్రమముగా వెదకిన నగుపడును. ఈప్రాకారములోపల నక్కడక్కడఁ బడియున్నరాళ్లతుక్కు, ఉన్నది. పూర్వపు రాజగృహములు వికలములయి కనఁబడుచున్నవి. కొన్నిగదు లిప్పటికి గోడలపై నున్నవి. ఈమహల్ దరవాజాదగ్గిర ఆట్‌పాళి అను నెనిమిదిప్రక్కలుగల భవనము, అంత చెడిపోకుండ నున్నది. దానిపై నొక అంతస్తుగలమేడ యున్నది.

పైని నొకగది క్రిందనొకగది యున్నవి. క్రిందిగదిలోనున్న కిటికీలగుండఁ జూచినచోఁ జుట్టునుండు స్థలము కనఁబడదు. రాజగృహముల నాశనములు మాత్రమే కనఁబడు చున్నవి, గాని ప్రజల గృహములేమియుఁ గానరావు. పాడుపడిన మెట్టదిబ్బలు, పెద్ద గోడలు, గల యావరణములు మాత్రము కానవచ్చుచున్నవి.

16. విజయనగర నాశనమునకుఁ గారణమయిన తేలకోటియుద్ధమును గుఱించి వ్రాసిన చరిత్రములో ఫెరిస్టా అనుతురష్కుఁడు విజయులైన పరరాజులు ఆపట్టణము లోని గొప్పగృహములను నాశనముఁజేసి యనేకవిధములైన అక్రమములను గూడ కావించిరని యుదాహరించెను. కనుక నిపుడు మనకగుపడు నిండ్లు, అంతగాఁజెడి పోలేదుగనుకఁ బ్రాచీనగృహములలో కొద్దియని యెన్నఁదగు.

17. జనానాకుఁ బడమట పాడుపడిన గుట్టయున్నది. అదియక్కడ నొక చిన్నకోట గోడయో, లేక వెలుపలనున్న బురుజులుగల యొక ఆవరణయో. దాని మధ్య విశాలమైన మార్గమున్నది. ఈయావరణ కొకప్రక్కను రాతికట్టడముతోఁ గూడిన పెద్దమట్టిగుట్టయున్నది. దానిపైని సగము దూరమువఱకు సరిచేయఁబడిన త్రోవయున్నది. దానిపై నొకచిన్నగది, దానికి మార్గము, ఉన్నవి. దీనిపేరు దసరా దిబ్బ యనుదురు. దీనిపైనుండి రాజులు దసరాలో నడవిమృగ వినోదములను, జెట్టీలు క్రింద కసరత్తు చేయఁగఁ జూచియుండనోపుదరు. దానిప్రక్కను నుండు రాతిపలకల మీఁద గొన్ని విగ్రహములును, చిత్రరూపములును, చెక్కఁబడియున్నవి. ఏనుఁగులు, లొట్టిపిట్టలు (ఒంటెలు), పెద్దపులులు, వానివేటగాండ్రు, లేళ్లను తరుముకుక్కలు, బోగమువాండ్రు, మొనగాళ్లు, ఇవియన్నియుఁ జెక్కఁబడి యున్నవి. కొన్ని స్థలముల లో రాజు సింహాసనము మీఁదఁ గూర్చున్నట్టులఁ జెక్కఁబడియున్నది. వారి యెదుట బల్లెము పట్టుకొని నిలుచున్నట్టులఁ గూడఁ జెక్కఁబడియున్నది.

18. వివిధములైన విగ్రహములు అనేకస్థలములలోఁ జెక్కఁబడి యుండినను, పెక్కుచోట్లలో బాగుగా నుండినను, మొత్తమున, పని మోటుగానున్నది. మఱియు ప్రక్కనుండు హజారు రామస్వామిగుడిలో నుండు పనివలె నుండలేదు.

19. దిబ్బదగ్గఱనే రెండురాతిదరవాజాలు భూమిలోఁబూడ్చఁబడి యున్నవి. ఒక్కొక్క దరవాజా ఏకశిలలోనుండియె చెక్కఁబడియున్నది.

20. ఇంకొకచమత్కారమయిన ప్రదేశ మేమనఁగా, 47½ అడుగులు పొడుగు, 3 అడుగులువెడల్పు, 2 అడుగులుయెత్తు, కలిగి యొకరాతిలోనుండియె చెక్కఁబడిన పశువులు నీరుత్రాగెడు తొట్టియున్నది. దానినిండ పాలుపోసి రాజులు గుఱ్ఱములకుఁ

ప్రాగించినారని వినికిడి. బహుశః చుట్టునుండుమృగములు నీళ్లుత్రాగుటకు నేర్పడి యుండవచ్చును.

21. ఈమైదానమునకు దక్షిణమున హజార్ రామచంద్రదేవాలయమున్నది. అది పూర్వపు రాజుల సొంత దేవతాగృహమని చెప్పుదురు.

22. ఈదేవాలయము క్రీ. శ. 1530 లో కృష్ణదేవరాయఁడు కట్టించినాఁడు. పాతకన్నడభాషలో గుడిగోడమీఁద శాసనములున్నవి. ఈగుడి తక్కినగుళ్లవలె నంత పెద్దదిగాదు. అంతచిత్రమైనదిగాదు. కాని యొకమూల నిర్జనప్రదేశములో నున్న చిన్న దేవళము కాననే దీనిని రాజులు సొంతదేవలముగా నుపయోగించుకొని యుండ వచ్చును. ఈదేవళములోఁ బ్రవేశించఁగనే గోడలమీఁదనుండు విగ్రహములు స్పష్ట ముగఁ గనిపించును. విగ్రహములను జూచినతోడనె భక్తి, గౌరవము, స్ఫురించి కొంతవఱకు మనస్సు ఆశ్చర్యమగ్నమైయుండు. శ్రీరామచంద్రునియొక్క విగ్రహ ములు గోడలమీఁద, స్తంభములమీఁదనేకములున్నవి. దానియందు రామాయణ కథా విశేషములు, మృగయావిశేషములు, బహురమ్యముగఁ జెక్కఁబడియున్నవి. శ్రీరామ చంద్రునియనేకవిగ్రహములు, ఇందుండుటఁబట్టి హజార (వెయ్యి) రామచంద్ర గుడియని పేరువచ్చినది.

23. చిత్రములను చూచుటకువచ్చిన చిత్రదర్శికి నందు ముఖ్యముగ సంతోష దాయకమేదియన, నాలుగురాతి స్తంభములమీఁదనుండు నర్ధమంటపము. అది నల్ల రాతిమీఁద మృదువుగఁ జెక్కఁబడి వివిధములైన విగ్రహములతోఁ గూడియున్నది.

24. హజార రామచంద్రునిగుడి పశ్చిమద్వారముఖముగా వచ్చినయెడల భూమి లోకిఁబోవు నొకమార్గము గనుపట్టు. అదిహంపికిఁబోవురోడ్డుదగ్గఱనున్న జనానాకొక మైలు దూరముననున్నది. ఇక్కడినుండి జనానాకు నేలలోపల మార్గముండెనని చెప్పు దురు. కొన్ని మెట్లు రాతిగదిదగ్గఱ వఱకున్నవి. దాని దరవాజాగుండపోయిన మఱి యొక గది కాన్పించును. అక్కడినుండిపోయిన మఱియొకటికాన్పించును. మూడవ గది పైకప్పువఱకు మట్టితో నిండియున్నది. అందుపైఁ బోవుటకు వీలులేదు.

25. దీనినుండివెళ్ళిన నేటితట్టునకు మార్గముకొన్నిమళ్ళమీఁదపోవును. ఇంకను గొంతదూరమున ఉద్దానవీరభద్రుని గుడియున్నది. సదరు వీరభద్రునికి నిప్పటికిఁ బూజ జరుగుచున్నది. ఈగుడిలోఁ జూడవలసిన విషయమేమియు లేదు. రోడ్డుపై స్తంభ ములుగల మిద్దెలతో నిరుప్రక్కల నెత్తయిన అరుగులుగల గొప్పవాకిలిగుండ కృష్ణ స్వామిగుడికిఁ బోవుచున్నది.

26. కృష్ణస్వామి దేవాలయము పాడుపడియున్నది. అది శ్రీవిరూపాక్షదేవా

లయమునకు దక్షిణమున సుమారు 600 గజముల దూరములోనున్న యొక పాడుపడిన బాజారునకెదురుగఁ బశ్చిమముననున్నది. ఆగుడిలో ననేకశాసనములున్నవి. అందులో నొకటి కృష్ణదేవరాయలవారు ఉదయగిరి ప్రాంతములను జయించివచ్చిన తరువాత నాగుడిని గట్టించినటులఁ జెప్పుచున్నది.

27. ఆగుడి ప్రాకారములో నలుచదరముగనున్న యొక గర్భగుడియున్నది. ప్రాకారమునకు నాలుగుద్వారము లున్నవి. రాతిపనితనము యావత్తు సాధారణపు పనిగానున్నది. కొంచెము మోటుతరహాగా గట్టఁబడియున్నది. అయిన, నాగుడి పెద్దరాళ్ళతో కట్టఁబడియున్నది. పొడువున 30 అడుగులును 4 అడుగులు దళసరమునుగల నరకఁబడ్డ పెద్దరాళ్ళు గోడలో అతి ఉన్నత స్థలములలోఁ గనుపించుచున్నవి. అవి యెటుల నుంచఁబడినవో తెలియదు.

28. కృష్ణస్వామిగుడికి నాగ్నేయమూల నాదిశేష సహితమయిన నృసింహస్వామి విగ్రహమున్నది. ఆవిగ్రహ శిరస్సుపై నాదిశేషుని పడగ ఆవరించియున్నది. నృసింహస్వామి నిలుచున్న విగ్రహము 35 అడుగులయెత్తునఁ జెక్కఁబడియున్నది. అదియంతయు నేకశిలామయము. నృసింహమూర్తిశౌర్యక్రౌర్యరూపములు స్ఫుటముగఁ జెక్కఁబడియున్నవి. తిప్పుసుల్తాన్ యోధులు దానిముక్కును నొకచేతిని నరికిరి. దాని బాహువు రెండడుగుల దళసరముగలది. ఆవిగ్రహము గుమ్మమున (వాకిలిని) అదియొక బ్రాహ్మణునిచే చెక్కఁబడినట్లును, దానిపూజ నిమిత్తము కృష్ణదేవరాయలు క్రీ. శ. 1529వ సంవత్సరములలో భూదానముఁజేసినట్లును శాసనమున్నది. ఈయేకశిలాప్రతిమకు దగ్గరనె 9 అడుగులు పొడవుగల పెద్దలింగముగల శివాలయమున్నది.

29. ద్వారముదగ్గఱనుండి విజయనగరపు కోట గుమ్మమునుండి కొంతదూరము నడచినచోఁ గొండ తలఁజేరుదుము. అక్కడినుండిచూచిన చుట్టు సుందరముగఁ గనుపించు. దాని చేరువుననే తుంగభద్రానది కొండలమధ్యఁ బ్రవహించును. అవతల గట్టున నానావిధ శిలలతోఁగూడిన కొండలున్నవి. హంపికిచేరువను, నదికిరుప్రక్కలను, గొండ లుండుటంజేసి, అది అంతవెడల్పుగ నుండలేదు. ఆనదికి దక్షిణమున, అనగా శ్రీవిద్యానగరపు వైపున, చిన్నకొండ గుట్టలున్నవి. మఱియు గుళ్ళు, గోపురములు, భవంతులు, పాడుపడియున్నవి. నదియొడ్డుననున్న పల్లెకు పంపాయని పేరుండెను. కన్నడదేశ మగుటంజేసి దాని నిపుడు హంపియని వాడుదురు. అది చిన్న పల్లె. అది హేమకూటమను పర్వతముననున్నది. రెండుమైళ్ళవతలను నదికి నుత్తరమున ఆనెగొంది (యేనుఁగుసందు) యను గ్రామమున్నది. అందు విజయనగరపురాజుల సంతతివారిప్పటికిని రాజ్యముచేయుచున్నారు. పూర్వము యూరోపుదేశస్థులువర్తక

మునకు మనదేశము వచ్చినప్పుడీరాజులు దక్షిణ హిందూస్థానమంతయు నేలిరి. అప్పుడు విజయనగరాధీశులని నామమునొందిరి.

30. ఈవిజయనగరము, ఇతర పట్టణములకంటె చాల భేదముగానున్నది. చుట్టు చేలుండి, మధ్య వీధులు తీర్చియుండి, సమమయిన ప్రదేశములనుండు నితరపట్టణముల వలెంగాక, ఈవిజయనగరములో వృక్షములేమియు లేక, రాళ్ళగుట్టలు విశేషముగ నున్నవి. గుట్టలమధ్యనుండు లోయలు బజారులుగఁ జేయఁబడియుండెను. వానిలో మూడిప్పటికి నగుపడుచున్నవి. తక్కినవాని గుర్తులున్నవి. అబ్దుల్ రజక్ అను తురక 'విజయనగరము సప్తప్రాకారములు గలిగిన గొప్ప పట్టణము'నివ్రాసెను. పట్టణములో మధ్య నాలుగు బజార్లుండెను. వానిలో మధ్య రాజుభవనముండెను. ప్రతిబజారు మొదట నొక యెత్తయిన మండపముండెను. అన్ని మండపములకంటె రాజుభవన మెత్తుగానుండెను. వీధులగుండఁ జెక్కఁబడిన రాతితొట్టిలో నీళ్ళు ప్రవహించుచుండెను. రాజమందిరమునకు దక్షిణమున దివానఖానాయను విశాలమైన మంత్రికచ్చేరియుండెను. దానికెదుట నొక మండపముండెను. రాజమందిరమునకువెనుక ధనాధిపతి గృహముండెను. రాజమందిరమునకు నెడమభాగమున టంకసాలయుండెను. టంకసాలవెనుక 300 గజములుపొడువు 20 గజములు వెడల్పుగల యొకబజారుండెను. దానిలో రాతితోఁజెక్కిన ఆసనముల్లు కూర్చుండుటకుండెను. ఇప్పటికి వీనిగుర్తులు అక్కడక్కడ కనిపెట్టవచ్చును.

31. 'ఓడంరాడాబార్లిమా' అను 'శజర్ ఫ్రెడరిక్' అను పాశ్చిమాత్యు లీనగరమును దర్శించి దీని యౌన్నత్యమును వర్ణించిరి. దీని వైశాల్యము 24 మయిళ్ళట. చుట్టుప్రక్కలనుండు పేటలను, పల్లెలను, గలిపినచో నన్నిమైళ్ళు నుండనోపు. నదిని గలుపుకొని కోటప్రాకారములు 16 మైళ్ళవఱకును వ్యాపించియుండెను. హంపినుండి బళ్ళారికిఁబోవురోడ్డున 8 మైళ్ళ తరువాత కోటగుర్తు లిప్పటికిని గనఁబడుచున్నవి.

32. నదీప్రవాహమువలెనే, తూర్పు పడమర ప్రదేశములలో, గుళ్ళు భవంతులు, ఇప్పటియిండ్లు, అక్కడక్కడ వరిమళ్ళు, చెరుకుతోటలు, కాలువలు, నేత్రముల కానందముఁ గలుగఁజేయును. ఆవీధి అరమైలు పొడుగు, 50 గజములు వెడల్పు గలది. దాని పడమటి కొనను హంపిలో ముఖ్యాలయమయిన శ్రీవిరూపాక్షదేవాలయమున్నది. ఆవీధి తూర్పుచివరను బసవేశ్వరుని విగ్రహము శిలమీద పెద్దదిగాఁ జెక్కఁబడియున్నది. దానికిఁ దూర్పునఁ బెద్దపెద్ద రాతిగుట్టలు గలిగిన కొండపయిని శివావతారముగు వీరభద్రుని యాలయమున్నది.

33. పంపాపతియగు శ్రీవిరూపాక్ష స్వామిగుడి దక్షిణ హిందూస్థానములోని

ఇతరదేవాలయములవలెనున్నది. దానికి రెండు గొప్పగోపురములు గలవు. సింహద్వారముపై గోపురము మిక్కిలిపెద్దది. దానికెదురుగనే రథమునడచు విశాలమయినవీధియున్నది. ఆగోపురముపైని వివిధములయిన బొమ్మలు చెక్కఁబడియున్నవి. అది యేడంతస్తులు గలిగినను, లోపల బోలుగానున్నది. అదిచిత్రము. పాశ్చాత్త్యులలోని ఇంజనీయరులు (Engineers) కూడ దానినిజూచి తచ్ఛిలావిజ్ఞాన నైపుణ్యముఁ గడుశ్లాఘించిరి. విఠ్ఠపయ్యయను మహానుభావులచే నాగోపురము గట్టఁబడినది. వారి సంతతివారిప్పటికి హూవిన హడగలి తాలూకాలోని వారి జాగీరుగ్రామమగు రంగాపురములో నేపేట వారికిసమారాధానముఁ జేయుదురు. రెండవ గోపురముఅంతకంటెచిన్నదియయినను బొమ్మలులేక ఒక అంతస్తునుండి పైఅంతస్తునకుఁ బోవుటకు సులభమయిన మార్గము గలిగియున్నది. ఆగోపురము కనకగిరి రాజుచే నిర్మితంబని చెప్పుదురు. దానిని బళ్ళారి కలెక్టరుగారగు రాబర్టసన్ దొరగారు 1837 వ సంవత్సరములో మరమ్మతుచేయించినారు. ఈగుడికి రెండుప్రాకారములున్నవి. మధ్యగోడయున్నది. అంతఃప్రాకారములోనే గర్భాలయము, ఇతరాలయములునున్నవి. అంతఃప్రాకారముయొక్కయుత్తరదక్షిణ కుడ్యములకు వెలుపల మన్మథ సరోవరము, లోకపావనము, అనురెండు సరస్సులున్నవి. వానిచుట్టు చిన్నగుళ్ళున్నవి. అవి ఇటీవలనే శిథిలమై పోయినవి. తుంగభద్రానదిలోనుండి బహిఃప్రాకారముగుండ వంటశాలకు నీరు ప్రవహించు కాలువయున్నది. అందువల్ల నవిచ్ఛిన్నముగ నీరెపుడునువచ్చుచుఁ బోవుచునుండును. ఉత్తరప్రాకారమున వసిష్ఠతీర్థమగు తుంగభద్రకుఁ బోనగు.

34. పూజజరుగుచున్న దేవతలేవియన. శ్రీవిరూపాక్షేశ్వరుఁడను 1 పంపాపతి, 2 పార్వతి, 3 భువనేశ్వరి, 4 చండికేశ్వరస్వామి, 5 వేంకటరామస్వామి, 6గులగంజ మాధవస్వామి,7 వినాయకస్వామి, 8 కుమారస్వామి, 9 సరస్వతి, 10 విద్యారణ్యస్వామి, 11 సింగరిభట్టు, 12 పాతాళేశ్వరస్వామి. విరూపాక్షస్వామి యాలయముపైని వంగిన కొండయున్నది. దానిపై నంచున, నలుచదురముగలిగిన చిన్నచిన్నగుళ్ళు తేనెపట్లవలె ననేకములున్నవి. ఇవి జైనాలయములు, మంచి స్థితిలోనున్నవి. ఇవి ప్రస్తుతము నిర్మానుష్యములు. ఈజైనగుళ్ళదగ్గఱ జక్కని లాజుతోఁ గూడినమార్గముగుండ కోట బహిఃప్రాకారమునకు వెళ్ళనగు. వీనికిఁదూర్పున పెద్ద వినాయక విగ్రహమున్నది. విగ్రహము చాలభాగము శిథిలమయినది. కృష్ణస్వామి కోవెలసమీపమునఁ గూడ నిట్టి ప్రతిమయున్నది. వానికి 'ఆవగింజగణపతి' 'శనగగింజగణపతి' యనిపేళ్ళు. పెద్ద వీధికి వెళ్ళురోడ్డున కెడమను శిలమీఁదఁ జెక్కినశిలయుంచినటులఁ దోచునొక విశాలమయిన గుహయున్నది. అది పూర్వము ఋష్యాశ్రమమయి యుండనోపు—

,,జంభయత మభితో రాయతః శునోహతం మృధోవిదధు స్తాన్యశ్వినా."—

౧ మం. ౧౭౨ సూ. ౪ ఋక్కు.

(ఓయశ్వినులారా! అన్నిప్రక్కలను మొఱుగుచువచ్చెడి యీకుక్కలను నాశము చేయుఁడు. మాశత్రువులను చంపుఁడు. ఇది మీ రెఱుఁగుదురు.)

,,అకర్మా దస్యు రభినో అమంతు రన్యవ్రతో అమానుషః

త్వంతస్యామిత్ర హన్వధ ర్దాసస్యదంభయ." ౧౦ మం. ౨౨ సూ. ౮ ఋక్కు.

(కర్మహీనులును మతిహీనులును అన్యవ్రతులును అమానుషులును అయినదస్యులు అంతటను చుట్టుకొని యున్నారు. ఓశత్రుసంహారకా! చంపుము. దాసజాతిని నాశము చేయుము.''

అధికబలవంతు లయినయార్యులు దస్యులను కుక్కలవలెఁ జూచుచు సాధ్యమైనంతవఱకు వారిని కుక్కలను జంపినట్లే చంపుచు వచ్చిరి. దస్యులును తమదేశము నాక్రమించుకొనవచ్చినయార్యులకు సులభముగా లోఁబడక బహిరంగముగా నిలిచి యుద్ధము చేసి గెలువలేక పోయినను రాత్రులవేళ నూళ్ళమీఁదఁబడి కాల్చి యార్యులను సంహరించుచు వారిపశువులను సొత్తులను దొంగిలుచు మార్గస్థులను చావమోఁదుచు కర్మలకు భంగముకలిగించుచు నానావిధముల బాధపెట్టుచు వచ్చిరి. ఇట్టి గుంపులకు నాయకులుగా నుండినవారి పేరులు సహితము కొన్ని ఋగ్వేదమునందుఁ జెప్పఁబడియున్నవి.

,,అవత్మనా భరతేకేతవేదా అవత్మనా భరతే ఫేనముదన్

క్షీరేణస్నాతః కుయవస్యయోషే హతే తేస్యాతాం ప్రవణే శిఫాయాః"

౧ మం. ౧౦౪ సూ. 3 ఋక్కు.

ఈఋక్కునందు దస్యులనాయకులలో నొకఁడగు కుయవుఁడు పేర్కొనఁబడి, శిఫానదియందు స్నానముచేసెడు వానిభార్య లిద్దఱును ఏటిలో మునిఁగిచత్తురుగాక యని కోరఁబడెను.

యుయోపనాభిరుపరస్యాయోః ప్రపూర్వాభి స్తిరతే రాష్టిశూరః

అంజసీ కులిశీ వీరపత్నీ పయోహిన్వానా ఉదభి ర్భరంతే.

౧ మం. ౧౦౪ సూ. ౪ ఋక్కు.

పయిదాని తరువాతి దైనయీఋక్కునందు దస్యులనాయకులలో నింకొకఁడగు ఆయువనువాఁడు పేర్కొనఁబడి, నీటిలో దాఁగెడువానిని అంజసీ, కులిశీ, వీరపత్నినదులు కాపాడునట్లు చెప్పఁబడెను.

అవద్రప్సో అంశుమతీ మతిష్ఠదీయానః కృష్ణో దశభిః సహస్రైః

ఆవత్తమింద్రః శచ్యాధమంతమపస్నేహి తీర్నృమణా అధత్త.—౧౩ ఋక్కు.

ద్రప్సమపశ్యం విషుణే చరంత ముపహ్వరే నద్యో అంశుమత్యాః
నభోనకృష్ణమవత స్థివాంసమిష్యామివోవృషణో యుధ్యతాజౌ.—౧౪ ఋక్కు.

ఎనిమిదవమండలములోని తొంబదియాఱవసూక్తమందలి పయి రెండు ఋక్కులలోను దస్యులనాయకులలో నేకొక్కఁడగు కృష్ణుఁడు పేర్కొనఁబడినాఁడు. పదివేలసేనలతో అంశుమతీనదీతీరమం దుండినట్లును, ఆసైన్యము నింద్రుఁ డెదిఁగి సంహరించినట్లును, సూర్యుఁడు మేఘములలో మఱుఁగుపడియున్నట్లుగా అంశుమతీతీర ప్రదేశములయందు దాఁగియుండినకృష్ణునిసేనలను నాశముచేయుఁ డని యింద్రుఁడు మరుత్తులను కోరినట్లును, చెప్పఁబడియున్నది. ఈప్రకారముగానే నవవాస్త్వుఁడు, బృహద్రథుఁడు, మొదలయిన శత్రునాయకు లనేకులు పేర్కొనఁబడి, వా రందఱును సంహరింపఁబడినట్లును, దస్యులు చంపఁబడునిమిత్తమే పుట్టినట్లును, ఋక్కులలో నక్కడక్కడఁ జెప్పఁబడియున్నారు. ఇట్లు శత్రుసంహారముచేసి దస్యులను పాఱఁద్రోలి జయశాలులయి వారిదేశము నాక్రమించుకొన్న యార్యులనాయకులలో నొకఁడు కుత్సుఁడు.

ఆదస్యుఘ్నా మనసా యాహ్యస్తం భువస్తే కుత్సః సఖ్యేనికామః
స్వేయోనౌనిషదతంసరూపావివాం చికిత్సదృతచిద్ధనారీ.

౪ మం. ౧౬ సూ. ౧౦ ఋక్కు.

ఈఋక్కునం దింద్రుఁడు దస్యుసంహారములో కుత్సునకు సహాయుఁ డయినట్లు చెప్పఁబడియున్నది. పూర్వోక్తసూక్తములోనే పదుమూడవఋక్కులో

పంచాశత్కృష్ణానివపః సహస్రాత్కం నపురోజరిమావిదర్దః.—

౪ మం. ౧౬ సూ. ౧౩ ఋక్కు.

ఏఁబదివేలు కృష్ణవర్ణులైనదస్యులు కుత్సునిచేత సంహరింపఁబడినట్లు చెప్పఁబడి యున్నది. ఆకాలమునందు దస్యులను సంహరించుటలో మహాప్రసిద్ధుఁ డయినయార్యుల నాయకుఁ డింకొకఁడు సుదాసుఁడు.

మహ్నోదివ్యక్షృథివీం పత్యమానః పశుష్కవి రశయ చ్చాయమానః.

౭ మం. ౧౮ సూ. ౮ ఋక్కు.

ఈఋక్కునందు (సుదాసుఁడు) భూమిని తనశౌర్యముతో నింపఁగా, చయమానునికొడు కైనకవియనువాఁడు పడెనని చెప్పఁబడి యున్నది. దీని తరువాతి ఋక్కునందు

......సుదాస ఇంద్రః సుతుకాం అమిత్రాన్నరంధయన్మానుషేవధ్రివాచః. ౯ ఋ.

అని సుదాసునిపక్షమున నింద్రుఁడు శత్రులను హతముచేసినట్లు చెప్పఁబడెను. అటు

తరువాత నొకబుక్కు దాటినతరువాత పదునొకండవబుక్కులో

ఏకంచ యోవింశతిం చ శ్రవస్యా వైకర్ణయోర్జనాన్ రజాన్యస్తః
దస్మోన సద్మన్ని శిశాతి బర్హిః శూరః సర్గమకృణోదింద్ర ఏషాం.—౧౧ బు.

సుదాసుఁడు శత్రువుల నిరువదియొక్కరిని జంపె ననియు, పురోహితుఁడు దర్భలుకోసినట్టుగా నతఁడు శత్రువుల నఱకె ననియు, ఇంద్రుఁ డతనికి సహాయులనుగా మరుత్తులను బంపెననియు, చెప్పఁబడినది. ఆపయిని మఱిరెండుబుక్కులతరువాత పదునాల్గవ బుక్కులో

నిగవ్యవోనవో దుహ్యవశ్చ షష్టి శతానుషుపుః షట్సహస్రా
షష్టిర్వీరాసో అధిషట్ దువోయు విశ్వేదింద్రస్య వీర్యాకృతాని.— ౧౪ బు.

పశువుల నపేక్షించి యనువుయొక్కయు దుహ్యునియొక్కయు నఱువదివేల యాఱువందల యఱువదియాఱుగురుసైనికులు చంపఁబడి రనియు, ఈకార్యము లింద్రునివీర్యమును ప్రకటించు చున్నవనియు, చెప్పఁబడియున్నది. ఈసూక్తములోని యింకొక్కబుక్కును మాత్ర మీసందర్భమున నుదాహరించి తరువాత మఱియొక యంశమునకుఁ బోవుదము. ఇంకను మఱి రెండుబుక్కులను విడిచి పదునేడవబుక్కునకుఁ బోవుచో నందు

ఆధ్రేణ చిత్తద్వేకంచకార సింహ్యం చిత్పేత్వేనా జఘాన
అవస్రక్తీర్వేశ్యావృశ్చదింద్రః ప్రాయచ్ఛద్విశ్వా భోజనాసుదాసే.—౧౭ బు.

మేఁకచేత సింహమును చంపించినట్లును, సూదిమొనచేత యూపదారువు పడఁగొట్టించినట్లును, ఈమహాకార్యములను నిర్వహింపించి యింద్రుఁడు సుదాసున కైశ్వర్యమును కలిగించెనని చెప్పఁబడినది. ఈప్రకారముగా దస్యులను జయించి క్రమక్రమముగా వారి నరణ్యములలోనికిఁ దఱిమివేసి యిప్పుడు పంజాబనఁబడెడు సింధునది మొదలుకొని సరస్వతీనదివఱకును గలదేశము నార్యు లాక్రమించుకొని, అడవులలో క్రొత్తపట్టణములను కోటలను కట్టి దేశమును బలపఱిచిరి. ఇట్లనేకులు చేరి క్రొత్తభూములు సంపాదించి యైశ్వర్యవంతు లయినప్పుడు వారిలో వారికి కలహములు సంభవించుటయు అస్వాభావికము కాదు. ఆకాలములో నార్యులలో నంతశ్ఛిద్రములు సహితము ముందుచువచ్చెను. ఆకాలమునందు పదిమందిరాజులు చేరి సుదాసునితో యుద్ధముచేసి యోడిపోయి రని ఋగ్వేదమే చెప్పుచున్నది.

ఇంద్రావరుణా వధనాభి రప్రతిభేదం వన్వంతా ప్రసుదాసమావతం
బ్రహ్మాణ్యేషాం శ్రుణుతం హవీమానిసత్యా తృత్సూనా మభవత్పురోహితిః.

౭ మం. ౮౩ సూ. ౪ బుక్కు.

ఈఋక్కునం దింద్రవరుణులు తమ యమోఘాయుధములతో భేదుని జయించి సుదాసుని కాపాడి రనియు, తృత్సువు లనెడిపురోహితులప్రార్థనలు సఫల మయ్యెననియు, చెప్పఁబడినది. ఆసూక్తములోనే యేడవ ఋక్కునందు

యువాహంహంత ఉభయాస ఆజిష్వింద్రంచ వస్వో వరుణంచ సాతయే

యత్ర రాజభి ర్దశభి ర్నివాధితం ప్ర సుదాస మావతం తృత్సుభిఃసహ.—౬ ఋ.

యుద్ధసమయమునం దుభయపక్షములవారును సంపదలనిమిత్త మింద్ర వరుణులను ప్రార్థించినను, ఈయుద్ధమునందు పదిమందిరాజులచే మార్కొనఁబడిన సుదాసుని తృత్సులతోఁగూడ రక్షించితి రని ఇంద్రవరుణులనుగూర్చి సంబోధింపఁబడినది. ఆపయిఋక్కునందు

దశ రాజానః సమితా అయజ్యవః సుదాస మింద్రా వరుణా నయుయుధుః

సత్యానృణామస్మసదాముపస్తుతిర్దేవా ఏషామభవ న్దేవహూతిషు.—౭ ఋ.

యజనము లేనియాపదుగురురాజులు నొక్కటిగాఁ జేరినను సుదాసుని నోడింపఁజాలక పోయిరని యింద్రవరుణులనుగూర్చి చెప్పఁబడినది.

ఆర్యులు చేసినయుద్ధములు శత్రువులు త మ్మెదిరించినప్పుడును, తమపశువులను దొంగిలినప్పుడును, రాజ్యలాభమునిమిత్తమునుమాత్రమే కాక శత్రువులధనమును కొల్లగొనుటనిమిత్తముకూడ నప్పు డప్పుడు చేయఁబడు చుండెను.

స నేమవాజం సమిధేష్వర్యో భాగం దేవేషు శ్రవసే దధానాః.—

మం. ౧, సూ.౭౩, ఋక్కు ౫.

ఈఋక్కునందు శత్రువులనుండి కొల్లను సంపాదించి దేవతలభాగము నర్పింతుముగాక యని చెప్పఁబడినది. ఆకాలమునం దార్యులు తమ శత్రువులతోఁ జేసినయుద్ధములయం దుపయోగించినయాయుధములు మొదలయినవి యించుమించుగాఁ దరువాతికాలమునందు భారతయుద్ధాదులలో నుపయోగింపఁ బడినవానితో సమానమైనవిగానే యున్నవి. ఋగ్వేదము నాలవమండలము నలువదియేడవసూక్తమునందు రణదుందుభి పేర్కొనఁబడి, ధ్వనితో భూమియు నాకాశమును నిండి చేతనాచేతనములను సంచలింపఁజేసి శత్రువులమనస్సులలో భీతిని పుట్టించి వారిని పాఱఁదోలునట్లు సంబోధింపఁ బడినది. ఆఱవమండలములోని ౭౫వ సూక్తములో కవచములు, ధనుర్బాణములు, అమ్ములపొదులు, యుద్ధరథములు, యుద్ధాశ్వములు, శిరస్త్రాణములు, హస్తత్రాణములు, విషలిప్తము లైనయినుపములుకులుగలబాణములు, వర్ణింపఁబడినవి. మఱికొన్ని ఋక్కులందు ఖడ్గములు, గండ్రగొడ్డళ్ళు, ఈటెలు, ధ్వజపటములు, ఏనుఁగులు, వర్ణింపఁబడినవి.

32. కృష్ణరాయలు రాజ్యాభిషిక్తు లయ్యెడికాలమునకు విజయనగరరాజ్యము సంకోచముగా నుండెను. దానిచుట్టు స్వతంత్రపుప్రభువులు చెలరేగిరి. తూర్పున కర్నూలురాజ్యము, ఉత్తరమున తురుష్కప్రభువులు, ఉండుటంబట్టి, యెటుపోవుటకు వీలు లేకుండెను. దక్షిణమున చోళ పాండ్యాధీశుల సంతత్యనుచ్ఛిత్తింబట్టి అటు వ్యాపించుట దుర్ఘటంబయ్యె. ఈదేశములలో చాలమట్టుకుఁ బూర్వము విజయనగర సంస్థానములోనివే యయియుండి రెండవహరిహరునికాలమందు విడిపోయినయవి. అయినను కృష్ణరాయఁడు పైతామహరాజ్యమంతయు నే గాక దేశాంతరమునుగూడ బాహుబలములచే నన్నిదిక్కుల సంపాదించెను. అతని ప్రథమదండయాత్ర దక్షిణమునకు, చామరాజనగరపు తాలూకాలోని ఉమ్మత్తూరుపైనిని, మగలవల్లితాలూకాలోని శివసముద్రముపైనిని, శ్రీరంగపట్టణముపైనిని దండెత్తెను. మోదుగల్లు, రాయచూరు పట్టణములలోని దుర్గములను బట్టుకొని వానియందు తన సైన్యము నుంచెను. తర్వాత నెల్లూరుజిల్లాలోని ఉదయగిరిని, కృష్ణాజిల్లాలోని కొండవీడును, సుబాయిలాకాలోని వరంగలును, గోదావరిపైనుండు కనకగిరిని, గౌతమికోటను పట్టుకొనెను. అంతటటితోఁ దనివిలేక, ఓఢ్రదేశపురాజయిన కళింగదేశాధిపతియగు కటకపురి రాజధానిగల గజపతిరాజుపై దండెత్తి, యతనితో సంధిచేసికొని, యతనికొమార్తెను వివాహమాడెను. బీజపూరు, గోలకొండ, అహమద్నగరులలోని తురకరాజులు కలసి క్రీ. శ. 1520వ సంవత్సరములో అతనిపైఁ గట్టుకొనిరాఁగా వారిపై నవలీలగానొనర్చినవిజయము, అతని జయసంతతిలో నుత్కృష్టము. ఆయుద్ధములోఁదురకలు పొందినయతిశయనష్టము చేత వారికి విజయనగరమువారికి అర్ధశతాబ్దమువఱకు సంధి చెడకుండ నుండెను. కృష్ణయొడ్డున యుద్ధము జరిగెను. కృష్ణరాయని సేనాధిపతి ధైర్యశాలియగు రామలింగన్న. కృష్ణరాయని జయధ్వజము 'సాల్ సెట్టి' అనఁగా బొంబాయి ద్వీపమువఱకు వ్యాపించెను. తురకలతోడి యుద్ధములలో బుడతకీచులు కృష్ణరాయని కెక్కువ సహాయముచేసిరి. శ్రీరంగపట్టణములో నొక యధికారిని స్థాపించి మధుర తిరుచినాపల్లులలోఁ గ్రొత్తప్రభువులను స్థాపించి మలయాళముంగూడ జయించెను.

33. కృష్ణదేవరాయఁడు విద్యాభోజుఁ డనుట స్వభావోక్తియే. అతని సంస్థానములో అష్టదిగ్గజము లనునెనమండ్రాంధ్రమహాకవు లుండిరి;— వారు మనుచరిత్రకారుఁడైన (1) అలసానిపెద్దన్న, (2) నంది ముక్కుతిమ్మన్న, (3) అయ్యలరాజు రామభద్రయ్య, (4) కవిధూర్జటి (5) మధ్యగిరిమల్లన్న, (6) నరసరాజీయకారకుఁడైన భట్టమూర్తి, (7) వికటకవియు పాండురంగమాహాత్మ్యకారుఁడునైన తెనాలి రామకృష్ణకవి (8) శతమఖయాజియు శతప్రబంధకర్తయు నైనశ్రీఅప్పయ్యదీక్షితులవారినిగూడ అష్టదిగ్గజములలోనివా రందురు. అదిసాహసము. అయితే వారు కొంతకాలము ఆ

సంస్థానములో నుండి శైవమతప్రవర్తకులైనట్టుల గన్పట్టు. వారికిని గృష్ణదేవరాయల గురువును శ్రీ వైష్ణవమతాభిమానులును నగుకోటికన్యాదానము తాతాచార్యులవారికిని బహువాదములు జరగినవి. కృష్ణదేవరాయలుగూడ కవి. ఆముక్తమాల్యదయను విష్ణుచిత్తీయకర్తయని గాథగలదు. అతనికిఁ జాల సేనయుండెను. అతనికిఁ దొమ్మిది కోట్లపయిగా ధన ముండెను. కర్నాటకరాజ్యమునుండియే, సాలుకు 84 లక్షల వరుఁబడియట. మెట్టపల్లపుభూములు, తోటలు, శిలాగృహములు, పచ్చికపట్లు, సాలెవర్గములు, ప్రాతళ్ళు, పురులు, రేవులు, సాయరు, ఎగుమతీలు, గొఱ్ఱెలు, మేకలు, కుమ్మరస్వరూపములు, గాజుసామాను, చెరుకుగానుగలు, కోడిగుడ్లతట్టలు, అపరదినుసులు, కానుకలు, మఠములు, బంగారుగనులు, కొండప్రదేశములు, వాగులు, బావులు, చెరువులు, కాలువలు, తటాకములు, నదులు, గ్రామకంఠములు వగయిరాలవల్లనుండి యతఁడు పన్నులు వసూలుచేసినట్టుల గనఁబడుచున్నది. తుంగభద్రమీద నుండెడుగొప్పఆనకట్టలు ఈప్రజారంజకుఁ డయినరాజుకాలములోఁ గట్టఁబడినవి. దక్షిణమున నుండు మహాస్థలములకు యాత్ర వెళ్లెను. ఇప్పటికి పెద్దతిరుపతిలో వేంచేసియుండు శ్రీవేంకటాచలస్వామివారి సన్నిధిని నందుకునిదర్శనముగ మూడుప్రతిమలు గానవచ్చును. తన రాజధానియందుఁగూడ అనేక దేవాలయములను గట్టించెను. నేడు కృష్ణరాయనిఆలయములు నికస్తుచెంది హంపిలోఁ గానవచ్చుచున్నను, కట్టినప్పుడు బహు బందోబస్తుతో గట్టఁబడినటుల గానవచ్చు చున్నవి.

34. క్రీ. శ. 1514వ సంవత్సరములో బుడతకీచు బాటసారియగు ‘డ్వార్టిబార్ బోర్యా’ కొంకణదేశపు టొడ్డునకు వచ్చెను. నరసింగప్రభువుని కోస్తాపట్టణమగు బరసారునం దోడలను జూచెను. అవి మలయాళము, ‘ఆర్మజు,’ ‘ఏడెన్’ ‘గ్జహారు’ పట్టణములనుండి వచ్చెను. మంగలూ రప్పుడు కోస్తాపట్టణములలో నుచ్చదశ గలది.

35. కృష్ణరాయరాజ్యములోనే సదరు ‘డ్వార్టిబార్ బోర్యా’ విజయనగరమును దర్శించెను. దాని వైభవమునుగూర్చి యీదిగువవాక్యములలో వ్రాసెను. “వైశాల్యముగల పట్టణము, విశేషజన భూయిష్ఠము, అమితభాగ్యవంతము, ‘పెగ్యూ’ నుండి వచ్చు వజ్రవైడూర్యములలో విరివిగల వర్తకముగలది. ‘చైనా’ ‘అలెగ్జాండ్రియా’ లతో పట్టువ్యాపారము గలది. మలయాళదేశముతో కర్పూరము, పునుగు, మిరియము, గంధము, దాళనలలో వ్యాపారముగలది. ప్రభుమహాళ్ళు, దేవళములు, శిలామయోన్నత గృహము లయినను, సాధారణపుప్రజ లందఱు మట్టిగడ్డిగలయిండ్లలోనే కాపురముఁ జేయుదురు.” అతఁడు వ్రాసినకథనుబట్టి యీరాజ్యము కృష్ణ దరిచేసికొని పశ్చిమసముద్రములో నుండుబుడతకీచుదేశమును మలయాళమును గలుపుకొని దక్షిణహిందూస్థాన మంతయు నాక్రమించి యుండెను. శ్రీకృష్ణనిర్యాణ మయినతోడనే ద్వాపరశ్రీ వెడలి కలి ప్రాభవమయినటుల, శ్రీకృష్ణరాయనితో విద్యావిజయలక్ష్మి

యంతర్ధానమంది జ్యేష్ఠాదేవి పాద మూనసాగెను.

36. కృష్ణరాయని సవతిసోదరుఁ డగుఅచ్యుతరాయఁడు క్రీ. శ. 1532 మొదలు 1542 వరకు రాజ్యముఁ జేసెను. ఇతఁడు దేవబ్రాహ్మణులకుఁ గొన్ని భూములు దానము చేయుటకంటె నెక్కువ ఘనకార్య మేమియుఁ జేయలేదు. ఇతఁడుతిన్నెవ్వేలిదేశముఁ లోఁబరచుకొనినట్లు గన్పట్టు. ఇతని కొడుకగు వెంకటదేవరాయఁడుకొన్ని నెలలుమాత్ర ము౦డి కాలము చేసెను. తర్వాత అచ్యుతరాయని తమ్మునికొడుకగుసదాశివుఁడు క్రీ. శ 1542వ సంవత్సరములో సింహాసన మెక్కి క్రీ. శ. 1576 వరకురాజ్యమునందుండెనుగా యతఁ డతిబాల్యుఁడగుటచే నతని మంత్రులయొక్కయు సరదారులయొక్కయు స మతిచొప్పున నతనిబావమఱఁదియగురామరాజు కార్యనిర్వాహము చేసెను. అతని గొందఱు కృష్ణదేవరాయని యమాత్యశిఖామణియగుఅప్పాజికుమారుఁడందురు. కృష్ణ రాయఁడు చని 40 సంవత్సరము లయినది. అప్పటికే రాజ్యము బలహీన మయ్యె. బయలునకు రాజ్యముగొప్పదిగా నున్నను లోన దుర్బలముగాన, క్రమము దప్పియుం డెను. దేశాంతరముసంపాదింప వలెనని రాజునకు నో రూరుచుండినను సొంతఖజానా లోని సొమ్ము మాత్రము మృగ్యంబు. సొమ్ము తెచ్చువెర వంతకంటె తెలియదు. దూరమున నుండులోఁబడినరాజ్యములు క్రమము దప్పియున్నవి. సిస్తువసూలుచేయు నేర్పాటు, రాజ్యపరిపాలన, రానురాను తగ్గుచున్నవి. తుదకు నేఁబదిసంవత్సరములలోఁగారాజ్య భ్రంశమునకుఁ దగుసామగ్రి హెచ్చుచున్నది. కాని సదాశివుని బొమ్మవలె త్రిప్పు రామరాజుయొక్క తెలివితేటలవలనఁ గొంతవరకట్టిదురవస్థ యాగెను. రామరాజు గొప్పయోధుఁడు, గాన తురకలతో యుద్ధమువచ్చినప్పు డొకరిమీద నొకరితని సాహా య్యముఁగోరెదరు. ఇతనిపేరన్న వారికిఁ బక్క బెదురు. క్రీ. శ. 1547 వ సంవత్స రములో బుడుతకీచులతో సంధిచేసికొని తనదేశములోని ఎగుమతి దిగుమతులవర్త కము నంతను వారిపరము చేసెను. రామరాజు విషయమయి చుట్టుపట్ల నుండు తురకరాజులకు నధిక గౌరవము గలదు. అందుకు దృష్టాంతముగ బీజపూరు సంస్థానాధి పతి యగుపడుచుసుల్తాను తనకు రామరాజుని దత్తపుత్రునిగా ననుకొనుభాగ్యము గలదని యోచించెను. ఈరాజ్యకాలములో సదాశివుని యూరుపేరు లేదు. సర్వము రామరాజే. అతఁడు ధైర్యశాలి, యోచనపరుఁడు, ప్రతాపవంతుఁడు. బీజపూరురాజైన అడిల్‌షా, గోలకొండరాజైన కుటుబ్‌షా, కొంతదేశ మిచ్చి యతని స్నేహపాత్రు లయిరి. సహజముగ గరిష్ఠుఁ డయినరామరాజున కిరుగుపొరుగువారి దుర్బలముచే గర్వము మరింత యెక్కువయి దుష్కాలము వచ్చెను. అది తుదకు తనకు, తనదేశమునకు నాశకారణ మయ్యె. ఒకసమయమున బీజపూరుసంస్థానపు రాయబారుని యవమాన పరిచెను. అంతట, పూర్వమే అవమానితు లయినతురుష్కప్రభువు లందఱును గూడి

జయనగరముపై క్రీ. శ. 1560 వ సంవత్సరమున ఒక్కపెట్టున దండెత్తవలెనని
శ్చయించుకొనిరి. బీజపూరు, గోలకొండ, అహమద్ నగరు, బీడరు నవాబులందఱు
జపూరులో కలిసి దక్షిణమునఁ గృష్ణయొడ్డున నుండు తేలకోటలోవిడిసిరి. రామరాజు
ాని నంతగ గమనింపకపోయినను దన తమ్ముఁడైన తిరుమలరాజుతో గొప్పబలమును
ాకోటఁ గాచుటకుఁ బంపించి యింకొకసేనతో వెంకటాద్రి యనుతమ్ముని పంపించి
ూలబలముతోఁ దానుగూడ వెడలెను. కృష్ణ దాటురేవునొద్ద హిందువులబల
ండుటంబట్టి దాటుటకు వీలు లేదని తెలిసి మహమ్మదీయులు తాము దాటమని యొక్క
స్క పన్నిరి. దానినినమ్మి హిందువులు రేవును వదలిరి. అంత తురుష్కులు సందు
ాచి నదిదాటి యివతలఁ బ్రవేశించిరి. అంతట నుభయులకు బలమయిన యుద్ధము
ాగెను. తురకలకునుఁ గుడిప్రక్కను బీజపూరునబాబయిన 'ఆలిఅడిల్‌షా' యు
ఎడమప్రక్కను బీడరుప్రభు వయిన 'ఆలిబురిడ్‌షా'యును గోలకొండ నైజామయిన
'కుటుబుషా'యును నుండి, మధ్యను అహమడ్‌నగరు నబా బయిన 'హుశేన్
నైజాంషా'యును నుండి సేనను నడిపించిరి. హిందూసేన రామరాజు మధ్య నుండి,
కుడి యెడమల వేంకటాద్రి తిరుమలరాజులు నడిపించిరి. యుద్ధారంభమున హిందువులు
శౌర్యమును బాగుగాచూపిరి. చాల జననాశ మాయెను. లక్షహిందువులు మడిసిరి.
తురకల నిరుప్రక్కలను హిందువు లోడించిరి. కాని గర్భమునకు చలనముగలుగలేదు.
అట్టిసమయములో దైవకృత మయిన వైపరీత్య మొకటిజరిగెను. అదిభావిసూచనకారి.
ఒకయుద్ధగజము మదాతిశయముచే విచ్చలవిడిగా త్రెంచుకొని తెగఁబడి రామరాజును,
అంభారీని క్రిందఁబడవేసెను. హా! దైవగతిని మానవయత్నమేమిచేయఁగలదు. గొప్ప
గలభ సాగెను. ఈసందుఁజూచితురకయోధులు చొరఁబడిరామరాజును బట్టుకొని తమ
వైపులకుఁ దీసికొనిపోయిరి. తత్క్షణమే యతని తల 'నైజాంషా' త్రుంచివేసి బల్లెము
కొనకు తగిలించి యిరుసేనలుచూడఁగాఁ ద్రిప్పెను. తమరాజుదుర్మరణముఁ జూచి
హిందువులు అధైర్యపడి నలుదిక్కులఁ బారిపోఁగా విరోధులు వారిని దఱిమిరి. ఈమహా
త్తరమయిన దుర్దినము క్రీ. శ. 1565 వ సంవత్సరము 25 వ జనవరి. ఈసుల్తానులు
విజయనగరముఁ జొరఁబడి కసిదీర నందలిధనము దోచి దానిలోని దేవళములను,
అంతఃపురములను బాడుచేసిరి. ఈయపజయమువలన విజయనగరపుసంస్థాన మస
లంటచెడిపోయెను. తిరుమలరాజు తిరుగ రాజధానిని జక్కపరచవలె నని యత్నించి
నను గొనసాగక దానిని వదలి క్రీ. శ. 1567 వ సంవత్సరమునఁ బెనుకొండకు వెడ
లెను. అతని తమ్ముఁడైన వేంకటాద్రి చంద్రగిరిలో నివసించెను. ఈగొప్ప హిందూ
రాజ్యముయొక్క అంత్యావస్థ యిది. 'జాతస్యహి మృతో ధృవం'గద. పెరుగుట విరు
గుట కొరకే అను లోకోక్తికి నిదర్శనము. వావిలాల-వేంకటశివావధాని. బీ, ఏ.